






పంచాయతీల.. దశ మారేనా?

- పంచాయతీ శాఖ మంత్రి పవన్‌పైనే సర్పంచ్‌ల ఆశలు
- జగన్ సర్కార్‌పై పోరాటం చేసి అలసిపోయారు
- కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో నిధులపై చిగురిస్తున్న ఆశలు
- 1172 పంచాయతీలకు రూ.42 కోట్లు విడుదల చేయాలంటున్న సర్పంచ్‌లు



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పంచాయతీలను నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా జగన్ ప్రభుత్వం పనిచేసింది. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసే ఆర్థిక సంఘం నిధులను కాజేసింది. పంచాయతీలకు నిధులు విడుదల చేయకుండా ముప్పుతిప్పలు పెట్టింది. నిధుల కోసం వివిధ రూపాల్లో సర్పంచ్‌లు పోరాటాలు చేసి అలసిపోయారు. ఉద్యమాలకు ఏ మాత్రం లెక్క చేయకుండా సర్పంచ్‌లను ఉత్సవ విగ్రహాల్లా మార్చేసింది. వైసీపీ ఓటమిలో సర్పంచ్‌లు కీలకపాత్ర పోషించారు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో పంచాయతీలకు స్వేచ్ఛ వచ్చినట్లయింది. ఐదేళ్లు పంచాయతీలపై జగన్ కక్షగట్టి నిధులు లేకుండా చేశారు. దీంతో పంచాయతీలలో కనీస వసతుల కల్పన కుంటుపడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పంచాయతీలకు నిధుల విడుదలపై ఆశలు చిగురించాయి. 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. పంచాయతీ రాజ్ శాఖ మంత్రిగా పవన్ కళ్యాణ్ బాధ్యతలు చేపట్టడంతో ఆయనపైనే నిధుల విషయంతో ఆశలు పెట్టుకున్నారు. మార్చి నెలలో కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సంఘం నిధులను పంచాయతీలకు విడుదల చేసింది. అప్పటి జగన్ ప్రభుత్వం ఈ నిధులను పంచాయతీల ఖాతాలకు జమ చేయకుండా దారి మళ్లించుకుంది. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని 1172 పంచాయతీలకు రూ 42 కోట్లు నిధులు ప్రభుత్వం నుంచి విడుదల చేయాలి. వీటి కోసం సర్పంచ్‌లు ఎదురుచూస్తున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు నిధులు ఇవ్వకపోవగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను వైసీపీ ప్రభుత్వం కాజేసింది. 15వ ఆర్థిక సంఘం నిధులను కేంద్ర ప్రభుత్వం మార్చిలో విడుదల చేసింది. ఈ నిధులను రాష్ట్ర ప్రభుత్వం తన ఖజానాకు జమ చేసుకుంది. కేంద్ర నిధులు మార్చి నెలలో విడుదల చేసినా నేటివరకు ఒక్క రూపాయి కూడా పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం జమ చేయలేదు. నిధుల కోసం పంచాయతీల పాలక వర్గాలు కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో కేంద్రం పంచాయతీలకు విడుదల చేసిన ఆర్థిక సంఘం నిధులను పంచాయతీ ఖాతాలకు జమ చేస్తుందని పాలక వర్గాలు ఆశిస్తున్నాయి.

పంచాయతీలను వైసీపీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే నిర్వీర్యం చేసింది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులను కూడా రాష్ట్ర ప్రభుత్వం తన ఖాతాలకు మళ్ళించుకుంటూ ఆర్థికంగా దెబ్బతీసింది. పల్లెల్లో ప్రగతి పనులను అడ్డుకుంది. 15వ ఆర్థిక సంఘం నిధులను కేంద్రం విడుదల చేసిన వెనువెంటనే పంచాయతీల బ్యాంకు ఖాతాలకు జమ చేయాలి. ఈ ప్రక్రియను గత ప్రభుత్వం తుంగలో తొక్కేసింది. ఐదేళ్లు నిధుల్లేక కనీసం పారిశుధ్య పనులను పల్లెల్లో నిర్వహించలేని దుస్థితిని పంచాయతీలు ఎదుర్కొన్నాయి. పంచాయతీలకు నిధులు జమ చేయాలని సర్పంచ్‌ల సంఘాలు వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహించినా పట్టించుకోకపోగా సర్పంచ్‌లను అణచివేసింది. వారే ఉద్యమించి మిన్నకుంటారే తప్ప వారు చేసేది ఏమి లేదన్న విధంగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఐదేళ్లు వ్యవహరించింది. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లోని 1172 పంచాయతీలకు రూ.42 కోట్లకు పైగా పంచాయతీలకు జమచేయాల్సి ఉంది.

గ్రామ స్వరాజ్యం తీసుకొస్తున్నామని ఉదరగొట్టిన జగన్ ప్రభుత్వం ఇందుకు విరుద్ధంగా వ్యవహరించారు. పంచాయతీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను హరించివేసింది. సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి పంచాయతీ అధికారాలకు గండికొట్టింది. ఈ నేపథ్యంలో 15వ ఆర్థిక సంఘం నిధులను ప్రభ్వుతం పీడీ ఖాతాకు బదిలీ చేసుకుంది. పంచాయతీల సర్పంచ్‌లు ఆందోళనను లక్ష్యపెట్టలేదు. సచివాలయాల నిర్వహణకు అయ్యే ఖర్చును స్థానిక సంస్థల నుంచి ముక్కుపిండి వసూలు చేసింది. ఇంతటితో ఆగక కేంద్ర ప్రభుత్వం విడుదల చేసే నిధుల విషయంలోనూ దుర్మార్గంగా వ్యవహరించిందని సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు.

రాజ్యాంగం ప్రకారం సంక్రమించిన హక్కుల అమలు నేపథ్యంలో ఆర్థిక సంఘం నిధులను నేరుగా పంచాయతీల బ్యాంకు ఖాతాలకు జమ చేయాలని కేంద్రం జారీ చేసిన ఉత్తర్వులను తుంగలో తొక్కింది. మార్చిలో కేంద్రం విడుదల చేసిన ఆర్థిక సంఘం నిధులు పంచాయతీల బ్యాంకు ఖాతాలకు జమ చేయలేదు. రాష్ట్ర ప్రభుత్వం తన ఖాతాకు బదిలీ చేసుకుంది. స్థానిక సంస్థల్లో ప్రజల మౌలిక వసతులకు సంబంధించిన పనులను చేపట్టాలని కేంద్రం 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగానికి మార్గదర్శకాలను నీళ్లొదిలింది. జలవనరులను పెంపొందించే కొనేందుకు చెరువులు, కుంటలు అభివృద్ధి, చెక్‌డ్యాంల నిర్మాణం, ఇంకుడు గుంతలు ఏర్పాటు, తాగునీటి పథకాల అభివృద్ధి, పారిశుధ్యం మెరుగుదల, మరుగుదొడ్ల నిర్మాణం, వ్యర్థాల నిర్వహణ తదితర పనులకు ప్రాధాన్యం కల్పించాలని సూచించింది. ఇందుకు విరుద్ధంగా ఆర్థిక సంఘం నిధులను ప్రభుత్వం లాగేసుకుంది.

సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలు అమల్లోకి తీసుకొచ్చిన వైసీపీ ప్రభుత్వం స్థానిక సంస్థల అధికారాలను హరించివేసింది. పంచాయతీ సర్పంచ్‌లు ఉత్సవ విగ్రహాల్లా మార్చేసింది. రాజ్యాంగం ప్రకారం పంచాయతీలకు అన్ని హక్కులు కల్పించాలని ఆందోళన చేసిన సర్పంచ్‌లను ఉక్కుపాదంతో అణిచివేసింది. ఎన్నికల్లో వైసీపీకి వ్యతిరేకంగా ఓట్లు వేయించి సర్పంచ్‌లు కసి తీర్చుకున్నారు. ఆర్థిక సంఘం నిధులను వెను వెంటనే పంచాయతీల ఖాతాలకు జమ చేయాలని సర్పంచ్‌లు కోరుతున్నారు. కూటమి ప్రభుత్వ కొలువు దీరడంతో నిధులు విడుదల జరుగుతుందని సర్పంచ్‌లు ఆశిస్తున్నారు. కొత్త ప్రభుత్వం పంచాయతీల ఆర్థిక సంఘం నిధులపై ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.

నేడు అమరావతికి చంద్రబాబు

- సీఎం హోదాలో నిర్మాణాల పరిశీలన
- వైసీపీ విధ్వంస ప్రజావేదిక నుంచే పర్యటన ప్రారంభం
- రాజధాని భవనాల స్థితిగతులను పరిశీలించనున్న ముఖ్యమంత్రి
- చంద్రబాబు భరోసా కోసం కోటి ఆశలతో ఎదురు చూస్తున్న రైతులు



గుంటూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): అమరావతి రూప శిల్పి చంద్రబాబు తన కలల రాజధానిని వైసీపీ ఐదేళ్ల పాలనలో పాడుబెట్టిన తీరును గురువారం పరిశీలించనున్నారు. అత్యద్భుతంగా అమరావతిని నిర్మించేందుకు నవ్యాంధ్ర ముఖ్యమంత్రిగా నాడు చంద్రబాబు ప్రణాళికలు రూపొందించగా 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ దానిని పాడుపెట్టారు. ఈ పరిస్థితుల్లో ఇటీవల ముఖ్యమంత్రిగా బాధ్యతలు చంద్రబాబు తన రెండో పర్యటలో భాగంగా రాజధాని అమరావతిలో పర్యటించనున్నారు. రాష్ట్రానికి రెండు కళ్లుగా ఉన్న పోలవరం, అమరావతిపై చంద్రబాబు దృష్టి సారించారు. ఐదేళ్ల వైసీపీ అరాచక పాలనలో అభివృద్ధికి నోచుకోక, అంధకారంలో మిగిలిపోయిన రాష్ట్ర రాజధాని దుస్థితిని పరిశీలించనున్నారు. జూన్ 12న ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన ఆయన బాధ్యతలు తీసుకునేందుకు ఈ నెల 13న అమరావతిలోని సచివాలయానికి వచ్చారు. అమరావతిలో చంద్రబాబు అడుగుపెట్టినప్పటికీ, ఆ రోజు కేవలం బాధ్యతల స్వీకరణకు మాత్రమే పరిమితమయ్యారు. కాగా గురువారం అధికారిక హోదాలో అమరావతిలో పర్యటించనున్నారు. జూన్ 13న సచివాలయానికి వస్తున్న ఆయనకు అమరావతిలో రైతులు, మహిళల నుంచి అపూర్వ స్వాగతం లభించింది. మంగళ హారతులు ఇస్తూ, పూల వర్షం కురిపిస్తూ ఆయనకు ఘనంగా స్వాగతం పలికి, ఆయనపై తన విశ్వాసాన్ని చాటుకున్నారు. ఈ పరిస్థితుల్లో గురువారం రాజధాని ప్రాంతంలో ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన నష్టాన్ని పరిశీలించి చంద్రబాబు ఎలాంటి హామీ ఇస్తారోనని రైతులు కోటి ఆశలతో ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు అమరావతి పర్యటన అత్యంత ప్రాధాన్యాన్ని సంతరించుకుంది.


నీటిలో మునిగివున్న పిల్లర్లు

పర్యటన ఇలా..

- ఉండవల్లిలోని ప్రజావేదిక పరిశీలన
- ఉద్దండరాయునిపాలెంలో శంకుస్థాపన ప్రాంతం
- సీడ్ యాక్సిస్ రోడ్డు దుస్థితి
- అధికారుల భవనాలు, మంత్రులు, న్యాయమూర్తుల గృహ సముదాయాల పరిశీలన
- ఐకానిక్ టవర్స్ నిర్మాణ ప్రాంతం

● ప్రజావేదిక సాక్షిగా పర్యటన

ఐదేళ్లుగా ఆగిపోయిన అమరావతి నిర్మాణాన్ని, నిలిచిపోయిన పనులను ఆయన పరిశీలించనున్నారు. గత ప్రభుత్వ విధ్వంసానికి నాంది ప్రస్థానంగా ఉన్న ఉండవల్లిలోని ప్రజావేదిక నుంచే చంద్రబాబు పర్యటన ప్రారంభమవుతోంది. అక్కడి నుంచి బయలుదేరి 2015 అక్టోబరు 22న ఉద్దండరాయునిపాలెంలో రాజధాని శంకుస్థాపన జరిగిన ప్రాంతాన్ని చంద్రబాబు తొలుత సందర్శిస్తారు. అక్కడ ఏర్పాటు చేసిన మ్యూజియంను పరిశీలిస్తారు. ఆ తర్వాత సీడ్ యాక్సిస్ రోడ్డు, ఆలిండియా సర్వీసెస్ అధికారుల భవనాలు, మంత్రులు, న్యాయమూర్తుల గృహ సముదాయాలను పరిశీలిస్తారు. ఐకానిక్ టవర్స్ నిర్మాణం కోసం పనులు మొదలు పెట్టిన ప్రాంతాన్ని చంద్రబాబు పరిశీలిస్తారు. వాటితోపాటు అమరావతిలో ఐదేళ్లుగా నిలిచిపోయిన ఇతర ప్రభుత్వ భవన సముదాయాలను చంద్రబాబు పరిశీలిస్తారు.

● ఘోరంగా దెబ్బతిన్న ప్రభుత్వ భవనాలు

ఐదేళ్ల వైసీపీ పాలనలో అమరావతి అడవిలా మారిపోయింది. రోడ్లు మొదలు, ప్రభుత్వ భవనాలు, రైతులకు ఇచ్చిన రిటర్నబుల్ వాణిజ్య, నివాస ప్లాట్లు మొత్తం 20 అడుగల ఎత్తున చిల్లకంపలతో నిండిపోయాయి. రాజధానిలో ప్రతి ప్రాంతాన్ని, ప్రతి కార్యాలయాన్ని కలుపుతూ సీడ్ యాక్సిస్ రోడ్డుతో పాటు ఉన్న డజన్ల కొద్దీ అంతర్గత రహదారులు ఘోరంగా దెబ్బతినిపోయాయి. రోడ్లు కుంగిపోయి, నెర్రెలు విచ్చి శిథిలమైపోయాయి. పలు ప్రభుత్వ భవనాలు పాకుడుపట్టి శిథిలమైపోయాయి. ఇనుము తుప్పు పట్టి పాడైపోయింది. దొంగల పాలైంది. ఐకానిక్ టవర్స్ కోసం 72 గుంటల పాటు వేసిన పునాదులు నీటిపాలయ్యాయి. ఈ నేపథ్యంలో వాటిని అభివృద్ధి చేయడానికి చంద్రబాబు ఎలాంటి మాస్టర్ ప్లాన్ వేస్తారు అనేది సర్వత్రా ఆసక్తిదాయకంగా ఉంది.

● రైతుల ఆశలు..


వైసీపీ ప్రభుత్వ పాలనలో రైతులు, మహిళలు నిత్య నరకం అనుభవించారు. అవమానాల పాలయ్యారు. వైసీపీ పాలన పోయి, కూటమి పాలన రావడంతో వారికి ఊరట లభించింది. అయితే గత ప్రభుత్వం తాలూకూ ఇబ్బందులు రైతులను వెంటాడుతూనే ఉన్నాయి. రైతులకు రావాల్సిన కౌలు ఇవ్వడం కోసం, వారికి న్యాయంగా దక్కాల్సిన రిటర్నబుల్ ఇళ్ల స్థలాలు, వాణిజ్య సముదాయాల స్థలాలు తమకు ఇవ్వడానికి సంబంధించి సీఎం చంద్రబాబు ఎలాంటి హామీ ఇవ్వబోతున్నారన్న ఆశతో రైతులు ఎదురు చూస్తున్నారు.

● ప్రమాణానికి ముందు నుంచే పనులు పరుగులు

చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయక ముందు నుంచే అమరావతిలో పనులు పరుగులు మొదలు పెట్టాయి. జూన్ 4న కూటమి అద్వితీయ విజయాన్ని సొంతం చేసుకోవడం, చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఖాయమవడంతో అమరావతిలో పనులు చకచకా ముందుకు సాగాయి. జంగిల్ క్లియరెన్స్ కోసం వందల కొద్దీ ఎక్స్‌కవేటర్లు, ట్రక్కులు రంగంలోకి దిగాయి. విద్యుత్ దీపాల వెలుగులతో సీడ్ యాక్సిస్ రోడ్డు సహా అమరావతి ధగధగలు ప్రపంచాన్ని తాకాయి. ఈ నేపథ్యంలో చంద్రబాబు పర్యటన తమ జీవితాల్లో ఎలాంటి వెలుగులు తేబోతోందోనన్న ఆశతో రైతులు, మహిళలు, రాజధానివాసులు కోటి ఆశలతో ఎదురు చూస్తున్నారు.


జగన్ ప్రభుత్వ హయాంలో కూల్చివేసిన ప్రజావేదిక


రాజధాని ప్రాంతంలో దట్టంగా పెరిగిన కంపచెట్లను తొలగిస్తున్న దృశ్యం


కంపచెట్ల మధ్య నిర్మాణ దశలో నిలిచిపోయిన భవన సముదాయం

ఘనంగా పట్టభద్రుల వేడుక

- ఆచార్య ఎన్జీరంగా యూనివర్సిటీ 56వ స్నాతకోత్సవం
- 1576 మంది విద్యార్థులకు డిగ్రీ సర్టిఫికెట్లు అందజేత

బాపట్లరూరల్, జూన్19: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 56వ వ్యవసాయ స్నాతకోత్సవం బుధవారం బాపట్ల వ్యవసాయ కళాశాలోని బీవీ నాథ్ ఆడిటోరియంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. వైస్ చాన్స్‌లర్ డాక్టర్ ఆర్.శారదా జయలక్ష్మీదేవి అధ్యక్షత వహించిన ఈ సభకు గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యఅతిథి డాక్టర్ ఐసీఏఆర్ డైరెక్టర్ జనరల్, డేర్ సెక్రటరి డాక్టర్ హిమాన్షు పాఠక్ హాజరై పట్టభద్రులకు పట్టాలను అందజేశారు. సభకు అధ్యక్షత వహించిన శారదా జయలక్ష్మీదేవి మాట్లాడుతూ శాస్త్రవేత్తల పరిశోధనలు, విస్తరణ సేవలు, విద్యార్థుల ప్రతిభకుగాను ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం దేశంలో 20వ స్థానంలో నిలిచిందన్నారు. ఏఎన్‌జీఆర్ఏయు పీజీ స్కాలర్‌షిప్ అవార్డును అందుకుందన్నారు. ఎఎన్‌జీఆర్ఏయు వ్యవసాయ డ్రోన్ పైలెట్ శిక్షణ సంస్థగా డీజీసీఏ సర్టిఫికెట్ పొందిన మొదటి రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయమన్నారు. ఇప్పటివరకు 20బ్యాచ్‌ల డ్రోన్‌పైలెట్ శిక్షణ పూర్తయింది. 361 డీజీసీఏ అధీకృత వ్యవసాయ డ్రోన్ పైలెట్‌లను తయారు చేయటం జరిగిందని తెలిపారు. డాక్టర్ హిమాన్షు పాఠక్ మాట్లాడుతూ రైతు సమాజానికి ఎనలేని సేవలందించిన ఈ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాన్ని సందర్శించటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ విశ్వవిద్యాలయంలో అభ్యసించిన విద్యార్థులు దేశ, విదేశాలలో కూడా మంచి పేరొందని తెలిపారు. విశ్వవిద్యాలయంలో పనిచేసే బోధన సిబ్బందిని, శాస్త్రవేత్తలను అభినందించారు.


ప్రసంగిస్తున్న ముఖ్యఅతిథి డాక్టర్ ఐసీఏఆర్ డైరెక్టర్ జనరల్, డేర్ సెక్రటరి డాక్టర్ హిమాన్షు పాఠక్

1576మందికి డిగ్రీ పట్టాలు

స్నాతకోత్సవంలో భాగంగా మొత్తం 1576 మంది విద్యార్థు డిగ్రీ పట్టాలు అందుకున్నారు. వీరిలో 895 ప్రత్యక్షంగా, 681 పరోక్షంగాను అందుకున్నారు. తాము పడ్డ కష్టానికి ఫలితంగా పట్టాలు అందుకోవటంపై విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఏజీ కళాశాల ఆవరణం మొత్తం పట్టాలు అందుకోవటానికి వచ్చిన విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు రావటంతో సందడి వాతావరణం నెలకొని ఉంది.




పట్టభద్రులైన విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

ప్రజాదర్బార్‌కు.. విన్నపాలు

- ప్రత్యేక యంత్రాంగంతో సమస్యల పరిష్కారానికి లోకేశ్ కృషి


ప్రజాదర్బార్‌లో బారులు తీరిన ప్రజలు

తాడేపల్లి, జూన్ 19: లోకేశ్ ప్రజాదర్బార్‌కు ప్రజలు పోటెత్తుతున్నారు. ఇప్పటివరకు వైసీపీ పాలనలో విసిగి వేసారిన ప్రజానీకం తమ సమస్యల పరిష్కారం లోకేశ్ ద్వారానే సాధ్యమని ఆయనను నేరుగా కలిసి వేకువ జామునే ఉండవల్లి ప్రజాదర్బార్‌కు విచ్చేసి వినతి పత్రాలు అందించి సమస్యలు వివరిస్తున్నారు. బుధ వారం నిర్వహించిన ప్రజాదర్బార్‌కు నియోజకవర్గం నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి సైతం విచ్చేసి వినతిపత్రాలు అందించారు. ప్రతి ఒక్కరి సమస్యను సావధానంగా వింటూ లోకేశ్ తన యంత్రాంగం ద్వారా ఆ సమస్యలను ఆయా శాఖలకు రిఫర్ చేసి పరిష్కారం చూపుతున్నారు.

సమస్యలివే...


మంగళగిరికి చెందిన కె.శ్రీలక్ష్మి.. లోకేశ్‌ను కలిసి తన దివ్యాంగ కుమార్తెకు పెన్షన్ మంజూరు చేయాలని అభ్యర్థించారు. భర్త చనిపోయి నలుగురు పిల్లలు ఉన్న తనకు జీవనాధారం కల్పించడంతోపాటు ఇంటిని మంజూరు చేయాలని సీతానగరానికి చెందిన కె.కనకదుర్గ లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. మానసిక దివ్యాంగురాలైన తనకుమార్తెకు గత వైసీపీ ప్రభుత్వం పించన్ నిలిపివేసిందని తిరిగి పునరుద్ధరించాలని తాడేపల్లికి చెందిన షేక్ సుల్తానావలి విన్నవించారు. రాజధాని రైతులకు ఇచ్చే పెన్షన్‌ను గత ప్రభుత్వం నిలిపివేసిందని తిరిగి మంజూరు చేయాలని నవులూరుకు చెందిన రైతు విజయకుమార్ విజ్ఞప్తి చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న తన కుమార్తెకు వైద్యసాయం అందించాలని దుగ్గిరాలకు చెందిన బి.శాంతరాజు కోరారు. మహాత్మా జ్యోతిబా పూలే బిసిడబ్ల్యూఆర్ స్కూల్, కాలేజిలలో పని చేస్తున్న పార్ట్ టైం సిబ్బందిని కాంట్రాక్టు పద్ధతిలోకి మార్చాలని సిబ్బంది కోరారు. వైసీపీ ప్రభుత్వం తొలగించిన 1800 మంది బీమా మిత్రలను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని లోకేశ్‌కు విన్నవించారు. రాష్ట్రంలోని ఎయిడెడ్ కళాశాలల్లో పని చేస్తున్న బో ధన, బోధనేతన సి బ్బందికి కనీస వేతనం అమలుచేయాలని ఏపిఏసి టిపియల్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. వైద్య ఆరోగ్యశాఖలో పని చేస్తున్న స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేయాలని ఏపీఎన్ఎస్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. కాగా సాధ్యాసాధ్యాలను పరిశీలించి ఆయా సమస్యలను పరిష్కరిస్తానని యువనేత లోకేశ్ హామీ ఇచ్చారు. ఆయా వర్గాలవారు మాట్లాడుతూ లోకేశ్ వద్దకు వెళితే తమ సమస్యకు పరిష్కారం లభిస్తుందన్న నమ్మకం ధైర్యం ఉందని లోకేశ్ ఒక నమ్మకమని వ్యా ఖ్యానిస్తూ వినతిపత్రాలు అందజేస్తున్నారు.


దివ్యాంగ కుమారుడిని ప్రజాదర్బార్‌కు తీసుకువస్తున్న ఓ కుటుంబం


వినతిపత్రం అందిస్తున్న నర్సింగ్ ఉద్యోగినులు

డీజీపీగా గుంటూరువాసి

- పోలీస్‌బాస్‌గా ద్వారకాతిరుమలరావు
- ప్రభుత్వ పాఠశాలలో చదివి ఐపీఎస్‌కు


ద్వారకాతిరుమలరావు

గుంటూరు, జూన్ 19: ప్రభుత్వ పాఠశాలలో చదివి ఐపీఎస్ కు ఎంపికైన ద్వారకా తిరుమలరావు ఏపీ డీజీపీగా నియమితులయ్యారు. గుంటూరులోని దేవాపురానికి చెందిన ద్వారకా తిరుమలరావు తండ్రి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ విభాగంలో పనిచేశారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఐదుగురు కుమార్తెలు ఉండగా అందులో ద్వారకా తిరుమలరావు ఒకరు. గుంటూరులో జన్మించిన ద్వారకా తిరుమలరావు కృష్ణనగర్‌లోని మున్సిపల్ స్కూల్లో ఐదో తరగతి వరకు చదివారు. ఆ తర్వాత లక్ష్మీపురంలోని పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్‌లో పదో తరగతి వరకు చదివారు. ఆ తర్వాత జేకేసీ కళాశాలలో ఇంటర్, డిగ్రీ పూర్తి చేశారు. కొంత కాలం గుంటూరులోని టీజేపీఎస్ కళాశాలలో మేథమేటిక్స్ లెక్చరర్‌గా పని చేశారు. సెంట్రల్ యూనివర్సిటీలో మేథ్స్ విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించారు. 1989లో ఆయన సివిల్స్‌కు ఎంపికయ్యారు. ఆయన భార్య వైద్య విభాగంలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు సంతానం. ఆయన కొంతకాలం చెన్నైలో సీబీఐలోను పనిచేశారు. ఆయన సొంత జిల్లా గుంటూరు కావడంతో మొదటి నుంచి కూడా ఆయనకు గుంటూరు జిల్లాలో పనిచేసే అవకాశం లభించలేదు. ఓ సామాన్య కుటుంబంలో జన్మించి ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించి ఆ తర్వాత ఐపీఎస్ అయిన ద్వారకా తిరుమలరావు డీజీపీగా ఎంపికవడంపై జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గుంటూరు నగరంలో చిన్ననాటి నుంచి ఆయనతో కలిసి చదువుకున్న అనేక మందితో ఇప్పటికీ ఆయన స్నేహ సంబంధాలు కొనసాగిస్తున్నారు.

రాష్ట్రాభివృద్ధికి కృషి చేయండి

● మంత్రి అనగానితో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు


రెవెన్యూ మంత్రి అనగానితో ఎమ్మెల్సీ లక్ష్మణరావు

రేపల్లె, జూన్ 19: రాష్ట్రాభివృద్ధి కోసం మంత్రి అనగాని కృషి చెయ్యాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ లక్ష్మణ్‌రావు ఆశాభావం వ్యక్తం చేశారు. బుధవారం రెవెన్యూ శాఖామంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని కుంటుపడిన రెవెన్యూ విభాగాన్ని అన్ని విధాలా ముందుండి నడిపించాలని ఎమ్మెల్యే లక్షణరావు కోరారు.

మంత్రిగా అనగాని నేడు పదవీ బాధ్యతల స్వీకరణ..

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయంలో గురువారం ఉదయం 11.36 నిమిషాలకు రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్ శాఖామంత్రి అనగాని సత్యప్రసాద్ బాధ్యతలు స్వీకరించనున్నారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు, సహచర మంత్రులను కలవనున్నారు.


సీటీఆర్‌ఐ ఎగ్జిబిషన్‌ని ప్రారంభిస్తున్న ఐసీఏఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షు

పరిశోధనలను పునర్ వ్యవస్థీకరించాలి

● సీటీఆర్ఐ ప్రదర్శన ప్రారంభోత్సవంలో ఐసీఏఆర్ డీజీ

గుంటూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య పంటలకు సంబంధించిన పరిశోధనలను పునర్‌వ్యవస్థీకరించాల్సిన అవసరం ఉందని ఐసీఏఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షుపాటక్ అన్నారు. బుధవారం మిర్చియార్డు రోడ్డులోని సెంట్రల్ టుబాకో రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌లో ఏర్పాటు చేసిన ప్రదర్శనని ఆయన ప్రారంభించారు. తొలుత సంస్థ ఆవరణలో స్వాతంత్ర్యానికి ముందు 1936లో నిర్మించిన పరిశోధనశాల భవనాన్ని సందర్శించారు. అనంతరం పొగాకులో కొత్తగా రూపొందించిన వంగడాలు, పొగాకు పంట నుంచి తీసిన ఆయిల్స్‌ని పరిశీలించారు. ఈసందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో సాగు జరుగుతున్న మిర్చిలో హైకలర్ వెరైటీని తాము గుర్తించామని చెప్పారు. ఆరకం మిర్చికి పేటెంట్ కోసం ప్రయత్నిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీటీఆర్ఐ అధికారులు, శాస్త్రవేత్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు విద్యా కిట్లు !

● విద్యామంత్రి నారా లోకేశ్ ప్రకటన
● పుస్తకాలు, యూనిఫాం, బ్యాగు తదితర వస్తువుల పంపిణీ
● ప్రభుత్వ యాజమాన్య కళాశాలల నుంచి ఇండెంట్ స్వీకరణ
● ఉమ్మడి జిల్లాలో 18, 675 మందికి లబ్ధి
● హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు



ప్రభుత్వ వృత్తి విద్యాజూనియర్ కళాశాల (గుంటూరు)

గుంటూరు(విద్య),జూన్ 19: ఇంటర్ విద్యార్థులకు ఈ ఏడాది నుంచి విద్యా కిట్లు పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రకటన చేయడంతో పాటు జూలై నెలాఖరులోగా దీనికి సంబంధించిన వివరాలు సేకరించాలని ఆదేశాలు జారీ చేయడంతో ఇంటర్ బోర్డు అధికారులు అప్రమత్తం అయ్యారు. నారా లోకేశ్ ప్రకటనతో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థిని విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, ఎయిడెడ్, కేజీబీవీ (కస్తూరిబా గాంధీ విద్యాలయాలు), మోడల్ స్కూల్స్, హైస్కూల్ ప్లస్, రెసిడెన్సియల్ యల్ స్కూల్స్ దాదాపు 60కి పైగా ఉన్నాయి. ఇందులో రెసిడెన్సియల్, కేజీబీవీల్లో ప్రభుత్వం పుస్తకాలు, యూనిఫాం, నోట్ పుస్తకాలు అందిస్తున్నారు. మిగితా చోట్ల ఇంటర్ చదివే సుమారు 18వేల మంది విద్యార్థులు టెస్ట్ పుస్తకాలు, నోట్ బుక్స్, బ్యాగులు, యూనిఫాం వంటి వాటిని బయట కొనుగోలు చేస్తున్నారు. ఇందుకోసం ఒక్కోవిద్యార్థిని సగటున రూ. 2500 వరకు ఖర్చుచేయాల్సి వస్తోంది. ప్రతి ఏటా ఈ మొత్తం పేద విద్యార్థులకు భారమే. ఈ నేపథ్యంలో ప్రభుత్వమే నోట్ బుక్స్, టెస్ట్‌బుక్స్ యూనిఫాం పంపిణీ చేయాలని నిర్ణయించడంతో విద్యార్థినీ విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సమాచారం సేకరిస్తున్న ఇంటర్ బోర్డు

ప్రభుత్వ యాజమాన్యాల్లోని విద్యా సంస్థల్లో ఇంటర్ చదివే విద్యార్థుల వివరాలు ఇప్పటికే ఇంటర్‌బోర్డు సేకరిస్తున్నట్లు ఆర్ఐవో జీకే జుబేర్ వెల్లడించారు. గుంటూరు జిల్లాకు సంబంధించి ఇప్పటికే విద్యార్థుల డేటా సిద్ధం చేశామని, మొదటి సంవత్సరం అడ్మిషన్లు ముగిశాక పూర్తి వివరాలు వస్తాయని తెలిపారు. ప్రభుత్వ నిర్ణయం వలన పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు కొంత ఆర్థిక భారం తప్పుతుందని అధ్యాపకులు చెబుతున్నారు.

వైసీపీకి ప్రజలు సరైన బుద్ధి చెప్పారు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

● పేదవాడు రూ. 500 కోట్ల ప్యాలెస్‌ను ఎలా నిర్మించాడు ?
● అక్రమ సొమ్ముతో కాంప్లెక్స్‌లు కట్టుకున్న కాసు
● గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఫైర్

పిడుగురాళ్ల జూన్ 19: ఐదేళ్ల వైసీపీ అరాచక పాలనకు ప్రజలు సరైన బుద్ధి చెప్పారని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం పిడుగురాళ్ల పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 151 సీట్లు వచ్చాయన్న అహంకారంతో రాష్ట్ర భవిష్యత్‌ను అంధకారంలోకి నెట్టారన్నారు. మూడు రాజధానుల పేరుతో నాటకాలాడిన జగన్‌కు రాష్ట్ర ప్రజలు సరైన గుణపాఠం చెప్పారన్నారు. చంద్రబాబు, లోకేశ్‌లపై, కుటుంబ సభ్యులపై వ్యక్తిగతంగా మాట్లాడిన మాటలు, చంద్రబాబును జైలుకు పంపటం వైసీపీ పతనానికి నాంది అని యరపతినేని వివరించారు. ఈ అఖండ విజయంతో తాము పొంగిపోకుండా బాధ్యత మరింత పెరిగిందని భావిస్తున్నామన్నారు. తనకు తాను పేదవాడు అని చెప్పుకునే జగన్ రూ.500 కోట్లతో రుషికొండ రాజమహల్‌ను ఎలా నిర్మించాడని ప్రశ్నించారు. గడిచిన ఐదేళ్లలో గురజాల నియోజకవర్గంలో 11 మంది టీడీపీ శ్రేణు హత్య, అక్రమ మైనింగ్‌తో 8 మంది చిన్నారుల మృతి జరిగినా ఎటువంటి విచారణ చేయకపోవటం బాధాకరమన్నారు. గురజాలలో అక్రమ సొమ్ముతో నరసరావుపేట, హైదరాబాద్‌లో కాంప్లెక్స్‌లు కట్టడమే కాసు మహేష్ రెడ్డికి తెలుసు అన్నారు. వైసీపీ లాగా హింస, దాడులు టీడీపీ నేతలు ఎవరు చేయవద్దని, అలా ఎవరైనా చేస్తున్నట్లు తన దృష్టికి తన వ్యక్తిగత ఫోన్ నెంబర్ ద్వారా తెలియజేయాలని గత వారమే ప్రకటించటం జరిగిందని యరపతినేని తెలిపారు. మీరు ఇచ్చిన భరోసా మాకు ఎంతగానో నచ్చిందని వైసీపీ నేతలు కొందరు ఫోన్ ద్వారా వివరించటం జరిగిందని తెలిపారు. ఎన్నికలకు ముందు పిడుగురాళ్ల బైపాస్‌రహదారి, మెడికల్ కళాశాల, జగనన్న కాలనీల్లో శిలాఫలకాలు వేయటమే కానీ పనులు పూర్తిచేద్దామన్న శ్రద్ధ కాసు మహేష్‌రెడ్డికి లేదన్నారు. గుత్తికొండ, దైదా, మోర్జం పాడు, భ్రటు పాలెంలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. తాను ఓడిపోతే రాజకీయ సన్యాసం చేస్తానన్న కాసు కుటుంబం ఇచ్చినమాటకు ఉంటుందన్న నమ్మకం తనకు ఉందని తెలిపారు. సమావేశంలో పాండురంగ శ్రీను, వడ్డ వల్లి సర్వేశ్వర రావు, తురకా వీరాస్వామి, సయ్యద్ అమీర్ అలీ, వెంకటేశ్వర్లు, రమేష్, హనుమంతరావు, ఎల్‌వీఆర్ తదితరులు పాల్గొన్నారు.

1400 గ్రాముల గంజాయి పట్టివేత

మంగళగిరి, జూన్19: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను బుధవారం అదుపులోకి తీసుకున్నట్టు పట్టణ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. మంగళగిరి పట్టణానికి చెందిన షేక్ మహబూబ్‌సుభానీ, కాజ గ్రామానికి చెందిన దొడ్డక పవన్‌కుమార్‌లు మంగళ గిరి రైల్వేస్టేషన్ సమీపంలో గంజాయి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో ఆకస్మికంగా దాడి చేసినట్టు చెప్పారు. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 1400 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. గంజాయి సరఫరా మూలాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు.

తాడేపల్లి పాతూరు గ్రామంలో..

తాడేపల్లి: ప్రాతూరు గ్రామంలో గంజాయి విక్రయాలు జరుపుతున్న ప్రశాంత్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి 1200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని సీఐ కళ్యాణ్‌రాజు తెలిపారు. అనంతరం నిందితుడిని కోర్టుకు హాజరు పరిచామన్నారు. గంజాయి కలిగివున్నా, అమ్మకాలు జరిపినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ ప్రజలను కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడి మృతి

కాకుమాను, వట్టిచెరుకూరు, జూన్ 19: రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతిచెందిన ఘటన బుధవారం జరిగింది. వట్టిచెరుకూరు పోలీసులు, కాకుమాను మండల విద్యాశాఖాధికారి కెన్నడీ తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు పట్టణానికి చెందిన పాగోలు విజయ్‌కుమార్(45) కాకుమాను మండలం వల్లూరు ఎంపీయూపీ పాఠశాలలో ఎస్జీటీగా విధులు నిర్వహిస్తున్నాడు. ద్విచక్ర వాహనంపై గుంటూరునుంచి వల్లూరు పాఠశాలకు వచ్చేక్రమంలో వింజనంపాడు వద్ద విజయ్‌కుమార్ ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని 108 వాహనంలో గుంటూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వట్టిచెరుకూరు పోలీసులు తెలిపారు. మృతుడు విజయ్‌కుమార్‌కు భార్య, కుమార్తె ఉన్నారు. ఆయన మృతి విషయం తెలుసుకున్న కాకుమాను మండల విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.

చరిత్రహీనుడు జగన్‌రెడ్డి

●టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు

గుంటూరు, జూన్19(ఆంధ్రజ్యోతి): వ్యభిచారులు, బెట్టింగ్‌ముఠా నేతలకు ప్రతిష్టాత్మక నీటిపారుదలశాఖనిచ్చి రాష్ట్ర ప్రజల జీవనాడైన పోలవరం ప్రాజెక్టును ఇరవయ్యేళ్లు వెనక్కు తీసుకెళ్లిన చరిత్రహీనుడు వైఎస్ జగన్మోహనరెడ్డి అని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రెండున్నర సంవత్సరాలపాటు నీటి పారుదల శాఖామంత్రిగా వెలగబెట్టిన అంబటి పోలవరం ప్రాజెక్టు గురించి తనకేమి అర్థం కాలేదని ఇప్పుడు మాట్లాడటం సిగ్గుచేటన్నారు. అలాంటి ఆంబోతులందరికీ ప్రజలు సరైన గుణపాఠం చెప్పారన్నారు. చంద్రబాబు హయాంలో 72 శాతం పనులు పూర్తయితే, జగన్ హయాంలో కేవలం 5 శాతం మాత్రమే పూర్తయ్యాయని నివేదికలు చెప్పటం చూసి వైసీపీ నేతలు సిగ్గు పడాలన్నారు. జగన్ ఐదేళ్ల పాలనపై కేంద్ర ప్రభుత్వం కానీ, సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి చేత కానీ విచారణ జరిపిస్తే కేబినెట్ మొత్తం జైల్లోనే ఉంటారని అన్నారు. జగన్‌లాంటి ఆర్థిక, అరాచక, అవినీతి, ఫ్యాక్షన్ నేరస్తుడు రాజకీయాల్లో ఉండటం ప్రజాస్వామ్యానికి ఏ మాత్రం మంచిది కాదని కనపర్తి హెచ్చరించారు.

బంగారం కోసం వచ్చి.. వృద్ధురాలి హత్య

● వినుకొండ పట్టణంలో ఘటన..

వినుకొండటౌన్, జూన్, 19: వృద్ధురాలిని గొంతు నుమిలి హత్యచేసిన ఘటన పట్టణంలోని కొత్తపేట ఎస్ఎస్సీ కాలవకట్ట బజారులో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. కాలవ కట్ట బజారులో నివాసం ఉంటున్న కోటిరత్నం (75), భర్త ప్రభుదాసు కలిసి జీవనం సాగిస్తుంది. బుదవారం సాయంత్రం భర్త ఇంటి నుంచి బయటకు వెళ్లిన సమయంలో, గుర్తు తెలియని ఇద్దరు యువకులు ద్విచక్రవాహనంపై వచ్చి, ఇంట్లో ఉన్న కోటిరత్నం వద్దకు వెళ్లి మెడలో బంగారం అపహరించేందుకు ప్రయత్నించారు. ఆక్రమంలో పెనుగులాట జరిగింది. దుడంగులు ఆమె మెడ నులిమి హత్యచేసి ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. అడిషనల్ ఎస్పీ లక్ష్మీపతి ఘటనా ప్రాంతానికి చేరుకుని, మృతదేహాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. మృతురాలికి భర్త, కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

న్యూజిలాండ్‌లో మెరిసిన తెలుగు తేజం

● స్కేటింగ్‌లో తేజేష్ బంగారు పతకం కైవసం


19 సీపీటీ 3 - తండ్రి, తాతలతో తేజష్

చిలకలూరిపేట, జూన్ 19: పల్నాడుజిల్లా చిలకలూరిపేట మండలం మురికిపూడి గ్రామానికి చెందిన తేజేష్ న్యూజిలాండ్‌లోని న్యూ ప్లై మౌత్ వేదికగా జరిగిన ప్రపంచ స్కేట్ ఓషియానియా అండ్ పసిఫిక్ కప్ ఛాంపియన్స్ షిప్ 2024లో మూడు పతకాలు కైవసం చేసుకున్నాడు. జూన్ 13 నుంచి 17 వరకు జరిగిన ఆర్టిస్టిక్ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌లో బంగారు పతకాన్ని సొంతం చేసుకున్నాడు. సోలో డ్యాన్స్ స్కేటింగ్‌లో సిల్వర్ పతకాన్ని సాధించాడు. క్వాడ్ ఫ్రీ స్టైల్ ఆర్టిస్టిక్ రోలర్ విభాగంలో బ్రాంజ్ మెడల్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. ఇలా ఒకే వేదికపై మూడు పథకాలు సాధించి రికార్డు సృష్టించాడు. వచ్చే సెప్టెంబరులో ఇటలీ వేదికగా జరగనున్న స్కేటింగ్ వరల్డ్ చాంపియన్ షిప్‌కు అర్హత సాధించాడు. ఒలంపిక్స్‌లో బంగారు పతకమే తన లక్ష్యమని తేజేష్ అంటున్నాడు. కాగా బుధవారం చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రతిపాటి పుల్లారావును తేజేష్ తన తండ్రి తాతలతో కలిశారు. ఈ సందర్భంగా తేజేష్‌ను ఎమ్మెల్యే ప్రత్తిపాటి అభినందించారు.

18 ఏళ్ల వయసుకే 152 పతకాలు ..

పిట్ట కొంచెం కూత ఘనం అన్నట్లుగా తల్లిదండ్రుల ప్రోత్సాహంతో మూడేళ్ల వయస్సునుంచే తేజేష్ స్కేటింగ్‌లో శిక్షణ తీసుకున్నాడు. హైదరాబాద్ నాచారంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఇంటర్ విద్య పూర్తి చేసిన తేజేష్ 18 ఏళ్ల వయసుకే 152 పతకాలు తన ఖాతాలో వేసుకున్నాడు.

200 బస్తాల వరి విత్తనాలు సీజ్


తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

చేబ్రోలు,జూన్19: అనుమతులు లేకుండా నిల్వ ఉంచిన 200 బస్తాల వరి విత్తనాలను సీజ్ చేసినట్లు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్ మెంట్ ఇన్‌స్పెక్టర్ ఏ శ్రీహరిరావు తెలిపారు. చేబ్రోలులోని వైసీపీ నేత ముసలా వేణు ఇంటి వెనుక వున్న గోడౌన్‌లో రూ. 3.96 లక్షల విలువైన 200 బస్తాల వరి విత్తనాలు ఉన్నట్లు సమాచారం అందగా సోదాలు నిర్వహించి వాటిని సీజ్ చేసి నట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. అయితే చేబ్రోలులోని రాధా ఎంటర్‌ప్రైజెస్ నిర్వాహకులు ఆ విత్తనాలు తనవేనని చెప్పటంతో అనుమతులు లేని ప్రదేశంలో విత్తనాలు నిల్వ ఉంచినందుకు గోపిశెట్టి శ్రీనివాస్, ముసలా వేణుపై 6ఏ కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో ఏవో కే. రమణకుమార్, సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం.రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	140, 149,160
చికెన్ విత్ స్కిన్	268.00
చికెన్ స్కిన్ లెస్	278.00


పూజలో పాల్గొన్న మంత్రి నాదెండ్ల మనోహర్, పక్కన ఆలయ ధర్మకర్త లింగమనేని దంపతులు

మహిమాన్వితం.. దశావతారుని ఆలయం

● మంత్రి నాదెండ్ల మనోహర్

పెదకాకాని, జూన్19: మహిమాన్విత దేవాలయంగా దశావతారుని ఆలయం ప్రసిద్ధి గాంచుతోందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుటగల దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మంత్రి మనోహర్‌కు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన దశావతారం వెంకటేశ్వర స్వామి, మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దశావతారం వెంకటేశ్వరస్వామి ఆలయం రానున్న రోజుల్లో మరింతగా భక్తుల మనన్ని పొందుతుంది అన్నారు. భారతదేశంలో ఎక్కడలేని విధంగా స్వామివారి అన్ని అవతారాలను ఏకశిల్పంగా తయారు చేయటం, మన ప్రాంతంలో ఆలయం నిర్మించటం ఎంతో ఆనందదాయకం అన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త లింగమనేని రమేష్, సుమన దంపతులు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.


పాదయాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్

టీడీపీ నాయకుల పాదయాత్ర

● ప్రారంభించిన ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్

పెదకాకాని, జూన్ 19: ఎన్నికల్లో పొన్నూరు నియోజకవర్గం నుంచి శాసన సభ్యుడిగా ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అఖండ మెజార్టీతో గెలవాలని నంబూరు గ్రామానికిచెందిన టీడీపీ నేతలు తెలంగాణ రాష్ట్రంలోని కొండగట్టు ఆంజనేయస్వామికి మొక్కుకున్నారు. నంబూరు గ్రామం ఎంపీటీసీ దొడ్డాక శిరీష భర్త శ్యామ్ బాబు, దొడ్డాక బ్రహ్మయ్య స్వామి మొక్కు తీర్చుకోవడానికి బుధవారం నంబూరు గ్రామం యాదవపాలెంలోని రామాలయం గుడి దగ్గర నుంచి పాదయాత్రకు బయలుదేరగా ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు మాకిరెడ్డి జయరామి రెడ్డి, సీనియర్ నాయకులు కుసం బ్రహ్మారెడ్డి, తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే పుల్లారావు, మంత్రి మనోహర్‌లకు శుభాకాంక్షలు తెలుపుతున్న క్రిస్టీనా దంపతులు

స్థానిక సంస్థలకు మంచి రోజులు

● జడ్పీ చైర్‌పర్సన్ క్రిస్టీనా దంపతులతో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, జూన్ 19: ప్రజా ప్రభుత్వంతో రాష్ట్రంలోని స్థానిక సంస్థలకు అన్నింటికి మళ్ళీ మంచిరోజులు వచ్చాయని మాజీ మంత్రి, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. బుధవారం ప్రత్తిపాటిని ఆయన నివాసంలో జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా, ఆమె భర్త సురేష్ కుమార్‌లు మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పుల్లారావు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ల నేతృత్వంలో రాష్ట్ర ప్రగతి తిరిగి పట్టాలెక్కడం ఖాయమని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల పరిపాలనకు కేంద్ర బిందువైన జిల్లా పరిషత్ కార్యాలయం ద్వారా గ్రామాల అభివృద్ధి దిశగా కృషి చేయాలని సూచించారు.

మంత్రి నాదెండ్లను కలిసిన జడ్పీ చైర్ పర్సన్

గుంటూరు సిటీ : రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెని క్రిస్టీనా, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ కత్తెర సురేష్ కుమార్ బుధవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు, పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణులను కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు.

ఇద్దరు కోఆప్షన్ సభ్యుల రాజీనామా ఆమోదం

మాచర్ల రూరల్, జూన్ 19: మాచర్ల పట్టణంలోని పురపాలక సంఘంలో వైసీపీకి చెందిన కోఆప్షన్ సభ్యులు అన్నెం అనంతరావమ్మ, షేక్ యాసిన్‌బాబులు తమ పదవికి రాజీనామా చేసినట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటదాసు తెలిపారు. వీరి రాజీనామాలు ఆమోదం పొందాయన్నారు. పట్టణంలోని అన్నా క్యాంటీన్ ఆధునీకరణకు రూ.4 లక్షలు మంజూరు చేశామని, త్వరలోనే పనులు పూర్తి చేసి ప్రారంభిస్తామని చెప్పారు. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలకు ఐదు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని అందిస్తున్నట్లు చెప్పారు. పట్టణ పరిధిలో మహిళలు ఇబ్బంది పడుతుండడంతో ప్రధాన సెంటర్లలో టాయిలెట్స్ ఏర్పాటు చేస్తామని కమిషనర్ వెంకటదాసు తెలిపారు.

56,368 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూన్19 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 56,542 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 53,638 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 16,907 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	8500	18000	334	9500	16000
నెంబరు. 5	9000	16000	నెంబరు. 5	9300	15800
273	13000	17000	273	15000	15500
341	9000	17000	341	8500	17000
4884	12500	12500	4884	–	–
సూపర్ 10	--	--	సూపర్ 10	–	–
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	8000	20000	తేజ	10000	19500
బ్యాడిగి	8500	17000	బ్యాడిగి	10000	17000
దేవనూరు డీలక్స్	9000	16700	దేవనూరు డీలక్స్	16000	16000
తెల్లకాయలు	4500	11500	తెల్లకాయలు	5000	12000

గుంటూరు జిల్లా ప్రజా పరిషత్ వారి ప్రకటన

ఆర్.సి.నెం:287/2024/హెచ్.4, తేది. 18. 06. 2024

వేలము నోటీసు

గుంటూరు జిల్లా ప్రజాపరిషత్ ఆధీనంలోని అచ్చంపేట మండల పరిధిలోని చామర్రు (పడవ), చింతపల్లి (పడవ), గింజుపల్లి (పడవ), తాడువాయి (పడవ), మాదిపాడు (పడవ), మరియు మాదిపాడు (బల్లకట్టు) రేవులకు, మాచవరం మండలములోని గోవిందాపురం బల్లకట్టు రేవునకు, అమరావతి మండలములోని దిడుగు, ధరణికోట, కొల్లిపర మండలములోని వల్లభాపురం రేవులకు సుంకములను వసూలు చేయు హక్కును గజిట్ నిబంధనల మేరకు 2024-25 సం.నకు తేది. 01.07.2024 నుండి తేది: 31.03.2025 వరకు గుంటూరు జిల్లా ప్రజా పరిషత్ ముఖ్యకార్యనిర్వహణాధికారి గారిచే జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయము గుంటూరు నందు పూర్తి చేసిన సీల్డ్ టెండర్లు ది. 27.06.2024న ఉదయం 10.00 గం.ల నుండి మధ్యాహ్నం 02.00 గం.ల వరకు స్వీకరించబడును. మధ్యాహ్నం 02.30 గం.ల నుండి బహిరంగ వేలం నిర్వహించబడును. మిగిలిన వివరములు జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయము, గుంటూరు పని చేయు వేళలలో హెచ్ 'H' కక్ష్య నందు లేక సంబంధిత మండల ప్రజా పరిషత్ కార్యాలయము నందు తెలుసుకొనవచ్చును.

సం/- ముఖ్యకార్యనిర్వహణాధికారి,
జిల్లా ప్రజా పరిషత్, గుంటూరు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందిస్తున్న ఎమ్మెల్యే గల్లా మాధవి

మెరుగైన విద్య అందించడమే సీఎం లక్ష్యం

● ఎమ్మెల్యే గల్లా మాధవి

గుంటూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థికి మెరుగైన విద్య అందించడమే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి అన్నారు. పశ్చిమ నియోజకవర్గంలోని పట్టాభిపురం మున్సిపల్ హైస్కూలు, ఓరియంటల్ హైస్కూళ్లలో చదువుతున్న విద్యార్థులకు స్కూలు బ్యాగులు, పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్‌లు, బూట్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని, విద్యార్థులకు వాటిని అందజేశారు. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడమే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థులు ఆకర్షితులయ్యే విధంగా విద్యా ప్రమాణాలను ఉపాధ్యాయులు పెంచాలని మాధవి కోరారు. ఇప్పుడు చదువుకునే విద్యా ర్థుల కోసం ఇంట్లో ఎంత మంది ఉంటే అంత మందికి తల్లికి వందనం పేరుతో చంద్రబాబు ఒక్కొక్కరికి సంవత్సరానికి రూ.15వేలు ఇవ్వనున్నారని, త్వరలోనే దానిని అమలు చేయబోతున్నామని గల్లా మాధవి తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రామకృష్ణ, కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్, నారా దాసు ప్రసాద్, జెట్టి బాబు, యర్రాకుల శ్రీను, కన్నసాని బాజీ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే నా ధ్యేయం : ఎమ్మెల్యే నసీర్



మద్దిరాల కాలనీలో సమస్యలపై అధికారులతో మాట్లాడుతున్న నసీర్

గుంటూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): తూర్పు నియోజకవర్గ అభివృద్ధే తన ధ్యేయమని ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. బుధవారం గుంటూరు 57వ డివిజన్ మద్దిరాల కాలనీ, బసవతారకరామ నగర్‌లలో పర్యటించి స్థానిక ప్రజల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. వైసీపీ ప్రభుత్వం సైడ్ డ్రెయిన్స్ నిర్మించకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు గురవుతున్నామని, చిన్నపాటి వర్షానికే ఇళ్లల్లోకి మురుగు నీరు వస్తుందని, పాములు వస్తున్నాయని, దోమలు వ్యాప్తి చెందుతున్నాయని, వాటి కారణంగా వ్యాధుల భారిన పడుతున్నామని మద్దిరాల కాలనీ, బసవతారక రామనగర్ వాసులు ఎమ్మెల్యే వద్ద వాపోయారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో మాజీ ఎమ్మెల్యే అసమర్థత వల్ల నియోజకవర్గంలోని ప్రజలు అన్ని విధాల నష్టపోయి సమస్యల సుడిగుండాల్లో చిక్కుకున్నారన్నారు. రానున్న ఆరు నెలల్లో సమస్యలను పూర్తిగా పరిష్కరిస్తామన్నారు. మద్దిరాల కాలనీలో మురిగునీటి కాలువలు నిర్మాణం చేపడతామని తాత్కాలికంగా రైల్వే అధికారులతో మాట్లాడి ఖాళీ ప్రదేశంలోకి డ్రెయిన్‌ను మళ్లించేలా చూస్తానని, మంచినీటి పైపులైన్లు, వీధి దీపాల సమస్యలని కమిషనర్, నగరపాలక సంస్థ అధికారులతో చెప్పి చేయిస్తానని అన్నారు. కార్యక్రమంలో అధికారులు డీఈ శ్రీధర్, ఏఈ సునీల్, తెలుగుదేశం, జనసేన నాయకులు జాగర్లమూడి శ్రీనివాసరావు, కనకారావు, పల్లెపోగు రమేష్, సుజాత, నాగకిరణ్, కాసింబాబు ఇమ్రాన్, శ్రీనివాసరావు నగరపాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంగా పవన్.. నెరవేరిన అభిమానుల కల

● తెలుగు తల్లి సమక్షంలో జనసేన వేడుకలు

గుంటూరు, జూన్ 19: గత వైసీపీ దుష్ట పాలనలో రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో చిక్కుకుందని, ఇటువంటి తరుణంలో ఎన్‌డీఏ కూటమి ఘన విజయం సాధించడం, నీతి, నిజాయితీ, నిబద్ధత కలిగిన జనసేనాని పవన్ కల్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతల స్వీకరణతో ప్రజాస్వామ్యం మరలా జీవం పోసుకుందని జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ల హరి హర్షం వ్యక్తం చేశారు. బుధవారం సచివాలయంలో పవన్ కల్యాణ్ డిప్యూటీ సీఎంగా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో ఆళ్ల హరి ఆధ్వర్యంలో జనసేన నేతలు కలెక్టరేట్ ఆవరణలోని తెలుగు తల్లి విగ్రహానికి పూలమాల వేసి, ప్రజలకు మిఠాయిలు పంచి వేడుకలు నిర్వహించారు. ప్రతి క్షణం ప్రజా సంక్షేమం గురించి పరితపించే పవన్ కల్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించడం తెలుగు వారు గర్వపడేలా చేసిందని హరి తెలిపారు. పవన్ కల్యాణ్ అధికారంలోకి రావాలని కోరుకున్న కోట్లాది మంది అభిమానులు, జనసైనికుల కల నేటితో తీరిందన్నారు. పెద్దన్నగా ప్రధాని మోదీ, విజనరీ సీఎం చంద్రబాబు నాయుడు, ప్రజా యుద్ధ నౌక పవన్ కల్యాణ్‌ల నేతృత్వంలో రాష్ట్రంలో సుపరిపాలన చూడబోతున్నామని ఆళ్ల హరి ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు సయ్యద్ షర్ఫుద్దీన్, బండారు రవీంద్ర, గడ్డం రోశయ్య, సయ్యద్ చాంద్, ఎస్‌ఎం సుభాని, నంది సరస్వతి, జూపూడి భవానీ, మిద్దె నాగరాజు, చింతకాయల సాయి, బత్తిన శ్రీనివాసరావు, ఉప్పుతల రాజు తదితరులు పాల్గొన్నారు.




తెలుగు తల్లి విగ్రహం దగ్గర జనసేన నేతలు

భారత్ స్కౌట్స్, గైడ్స్ ఆధ్వర్యంలో రేపు అంతర్జాతీయ యోగ దినోత్సవం

గుంటూరు, జూన్ 19: అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈనెల 21 నుంచి 23 వరకు భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో సదరన్ రీజియన్ స్థాయి యోగ, ఆహార నియమ నిబంధనలపై అవగాహన కార్యక్రమం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని సుదర్శన్ భవన్‌లో యోగా మెడిటేషన్ సెంటర్ మొదటి రోజు ప్రారంభ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో దక్షిణాది రాష్ట్రాలు తమిళనాడు, కేరళ, తెలంగాణ, గోవా, ఆంధ్రప్రదేశ్, అండమాన్, కర్నాటక, సదరన్ రైల్వే విభాగం నుంచి స్కౌట్స్ అండ్ గైడ్స్ వారు హాజరయ్యారు. గుంటూరు ఉప విద్యాశాఖ అధికారి వేంకటేశ్వరరావు, సదరన్ డైరెక్టర్ కుముద్ మెహరా, స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర ఎస్‌వోసీ శ్రీనివాసరావు, స్కౌట్స్ గైడ్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీమద్భగవద్గీతపై ప్రవచనం

గుంటూరు(తూర్పు), జూన్ 19: స్థానిక బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై బండ్లమూడి విజయలక్ష్మి సౌజన్యంతో బుధవారం భగవద్గీతలోని జ్ఞాన విజ్ఞానయోగఃపై ఆధ్యాత్మిక ప్రవచనం జరిగింది. తొలుత ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. చిన్మయా మిషన్ బ్రహ్మచారి సువీరానందస్వామి ప్రవచిస్తూ శ్రీకృష్ణ పరామాత్మ అర్జునిడితో సూర్య చంద్రులలోని కాంతి, వేదము లన్నింటిలో ఓంకారమును నేనే అని శ్రీకృష్ణుడు అన్నారని అన్నారు. సమస్త జీవరాశులలోని నేను నిండియున్నానని భగవాన్ శ్రీకృష్ణుడు తెలిపాడని భగవత్ భక్తులకు సవివరంగా తెలియజేశారు.



ప్రవచనం చేస్తున్న సువీరానంద స్వామి

అసంపూర్తిగా ఇన్నర్‌రింగురోడ్డు పార్కు

● వాకింగ్‌ట్రాక్ పక్కనే చెత్త కుప్పలు

● అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా

గుంటూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ ఇన్నర్ రింగు రోడ్డు పార్కుకు ఆలన పాలన కరువైంది. ఈ పార్కుకు కనీసం వాచ్‌మెన్ కూడా లేకపోవడంతో రాత్రిళ్లు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని స్థానికులు చెబుతున్నారు. రూ.లక్షలు ఖర్చు పెట్టి పార్కుని నిర్మించినప్పటికీ కొన్ని అసంపూర్తిగా వదిలేసిన నిర్మాణాలతో నేడు ఈ పార్కు పాడుబడినట్లు కనిపిస్తున్నది. నిత్యం ఆరోగ్యం కోసం ఇక్కడికి వస్తున్న వందలాది మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాకింగ్ ట్రాక్ పక్కన చెత్తకుప్పలు పేరుకుపోయాయి. కాసేపు సేద తీరేందుకు కనీసం రూఫ్‌టాప్ ప్రదేశాలు లేవు. ఈ విష యంపై పలుమార్లు కార్పొరేషన్ అధికారులకు నివేదించినా వారు స్పందించడం లేదని స్థానికులు వాపోతున్నారు. తక్షణమే నగర కమిషనర్ జోక్యం చేసుకొని పార్కుని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి పర్యవేక్షణకు ఒక వాచ్‌మెన్‌ని నియమించాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీ పాండురంగ విఠల్ కోరారు.





మహాత్మాగాంధీ ఇన్నర్ రింగురోడ్డు పార్కులో అసంపూర్తి నిర్మాణాలు

పవన్ కల్యాణ్ ఫ్లెక్సీలు చింపివేతపై జనసేన ఆగ్రహం

● నిందితులపై చర్యలకు నేతల డిమాండ్

గుంటూరు, జూన్ 19: ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంగా బుధవారం పవన్ కల్యాణ్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా జనసేన పార్టీ శ్రేణులు ఉత్సాహంగా నగర ప్రధాన కూడళ్లల్లో భారీగా ఏర్పాటు చేసిన జనసేన ఫ్లెక్సీలను తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు చింపి వేయడంపై జనసేన నాయకులు భగ్గుమన్నారు. పాతగుంటూరు, బస్టాండ్, మాయబజార్ సెంటర్ నుంచి హిమనీ సెంటర్, హిందూ కాలేజీ వరకు రోడ్డు డివైడర్ల మధ్యలో భారీగా జనసేనాని పవన్ ఫ్లెక్సీలను పార్టీ నాయకులు, అభిమానులు ఏర్పాటు చేశారు. బుధవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు వీటిని చింపివేశారు. దీంతో తీవ్ర ఆగ్రహం చెందిన జనసేన నాయకులు మహేష్ దార్ల నేతృత్వంలో ఆందోళనకు దిగారు. ఎన్‌డీఏ కూటమి విజయాన్ని, జనసేన ఘన విజయాన్ని చూసి తట్టుకోలేక ఉక్రోషంతోనే నిందితులు ఈ పనికి పాల్పడి ఉంటారని వారు ఆరోపించారు. అనంతరం ఫ్లెక్సీలు చింపిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ లాలాపేట, పాతగుంటూరు పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. అదేవిధంగా అడిషనల్ ఎస్పీని కలసి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు షేక్ మహమ్మద్ రఫీ, తులం మహేష్, జానకీ శంకర్, పాడి సాంబశివరావు, శంకర్ నాయుడు, ఉగ్గిరాల శేషు, చందు విజయ్, మల్కా శ్రీనివాసరావు, ఏ.అరవింద్ తదితరులు పాల్గొన్నారు.



గుర్తు తెలియని వ్యక్తులు చింపిన జనసేన ఫ్లెక్సీలు



కాలినడకన తిరుమలకు బయలుదేరిన టీడీపీ గిరిజన నాయకులు ధారూ నాయక్ తదితరులు

మొక్కులు తీర్చుకున్న టీడీపీ గిరిజన నాయకులు

గుంటూరు, జూన్ 19 : టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఏపీ ముఖ్యమంత్రిగా ఎన్నికైన నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ గిరిజన సంఘ నాయకులు మొక్కులు తీర్చుకున్నారు. ఈ మేరకు బుధవారం టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ధారూనాయక్ ఆధ్వర్యంలో గిరిజన నాయకులు కాలినడకన తిరుమల బయలుదేరారు. స్వామివారిని దర్శించుకున్న ఆయా నాయకులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, రాష్ట్ర అభివృద్ధి కోసం చంద్రబాబు చేస్తున్న కృషికి దేవుని ఆశీస్సులు ఉండాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ సెల్ నాయకులు, కళావతి, భూక్యా బాలాజీ నాయక్, మనోహర్ నాయక్, తిరుపతి పార్లమెంట్ ఎస్టి సెల్ అధ్యక్షులు, సుబ్బయ్య, డాక్టర్ మునేంద్ర నాయక్, మున్నా నాయక్ పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్‌కు బ్రాహ్మణ గాయత్రి సంఘం అభినందనలు

గుంటూరు, జూన్ 19 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిప్యూటీ సీఎంగా పదవి బాధ్యతలు చేపట్టిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు గాయత్రి బ్రాహ్మణ సంక్షేమ సంఘం అభినందనలు తెలియజేసింది. ఈ మేరకు బుధవారం కంకరగుంటలోని సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘ నాయకుడు పొత్తూరి భైరవకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఐదేళ్లు అరాచక పాలన సాగించిన వైసీపీ ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకిలించి వేయడంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి పార్టీలు చేసిన కృషి అభినందనీయమన్నారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో సర్వతో ముఖాభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ డిప్యూటీ సీఎంగా పదవీ బాధ్యతలు చేపట్టడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. తొలిసారి అసెంబ్లీలో అడుగుపెట్టబోతున్న పవన్ కళ్యాణ్ ప్రజా సమస్యల పరిష్కారంలో రాజీలేని పోరాటం చేస్తారని భైరవకుమార్ ఆశాభావం చేశారు.

తూనికల శాఖ అధికారుల తనిఖీ

తాడికొండ, జూన్ 19: తాడికొండలోని ఎంఎల్‌ఎస్ పాయింట్‌లో తూనికల, కొలతలశాఖ అధికారులు ఆకస్మికంగా బుధవారం తనిఖీలను నిర్వహించారు. కంది పప్పు, పంచదార, ఆయిల్ ప్యాకెట్లను తనిఖీ చేశారు. లీగల్ మెట్రాలజీ జాయింట్ కంట్రోలర్ ఎంఎస్‌ఎస్ మాధురి మాట్లాడుతూ తనిఖీల్లో కందిపప్పు, పంచదార ప్యాకెట్లలో 15గ్రాముల వరకు తరుగు ఉన్నట్లు గుర్తించామన్నారు. కందిపప్పు, పంచదార సప్లై చేసే వారి నుంచే తరుగు వస్తున్నట్లు తెలిపారు. దీంతో సరుకును సప్లై చేసే వారిపై కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు.

అంబేద్కర్ విదేశీ విద్యానిధిగా పునరుద్ధరణ హర్షణీయం

● స్వర్ణాంధ్రా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఏసుబాబు మాదిగ

గుంటూరు(తూర్పు), జూన్ 19: గతంలో చంద్రబాబు హయాంలో అమలైన పథకాల పేర్లను పునరుద్ధరణ చేయడం ఆహ్వానించదగ్గ విషయమని స్వర్ణాంధ్రా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఏసు బాబు మాదిగ అన్నారు. బుధవారం గోరంట్లలోని సంఘ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఉన్న జగనన్న విదేశీ విద్యా దీవెనను అంబేద్కర్ విదేశీ విద్యానిధిగా పేరు మార్చడంపై హర్షం వ్యక్తం చేశారు. పథకాల పేర్లు మార్పుపై రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా వీరాంజనేయస్వామికి కృతజ్ఞతలు తెలిపారు. కీలకమైన హోంశాఖ పదవి ఎస్సీలకు ఇవ్వడంపై సీఎం చంద్రబాబు నాయుడుకు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో సంఘ నాయకులు ప్రభాకర్, కొండ య్య, రాజు, రమేష్, మరియదాసు తదితరులు పాల్గొన్నారు.

20 పడకలతో త్వరలో బర్న్స్ వార్డు ఏర్పాటు

గుంటూరు (మెడికల్) జూన్ 19: ప్రభుత్వ సమగ్రాస్పత్రికి కాలిన గాయాలతో వచ్చే రోగులకు ప్రత్యేకంగా 20 పడకలతో ప్రత్యేక వార్డును త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ వై కిరణ్‌కుమార్ తెలిపారు. ప్లాస్టిక్ సర్జరీ విభాగానికి అనుబంధంగా ఈ వార్డు పని చేస్తుందని ఆయన వివరించారు. ప్రస్తుతం కమర్షియల్ క్యాంటీన్ ఉన్న ప్రాంతం స్థానంలో బర్న్స్ వార్డు చికిత్సకు కొత్త వార్డును ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. కాలిన గాయాల రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించే బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించాలని ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ సుమితా శంకర్‌ను ఆయన కోరారు.

ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు

గుంటూరు, జూన్ 19: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ యువనేత రాహుల్ గాంధీ 54వ జన్మదిన వేడుకలు రాజీవ్‌గాంధీభవన్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లింగంశెట్టి, ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌వలి, ఉడా మాజీ ఛైర్మన్ వణుకూరి శ్రీనివాసరెడ్డిలు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. మస్తాన్‌వలి మాట్లాడుతూ దేశానికి భావి ప్రధానిగా కార్యక్రమంలో పార్టీ నాయకులు కొరివి వినయ్‌కుమార్, బిళ్లా సునీల్, బొట్ల బ్రహ్మం, చుక్కా చంద్రపాల్, పాలపాటి అనీల్, వెంకటేశ్వరరావు తదితరులున్నారు. అలానే రాహుల్‌గాంధీ జన్మదినం సందర్భంగా పార్టీ నాయకులు బిళ్లా సునీల్, బొట్ల బ్రహ్మం, ఇంతియాజ్ ఆధ్వర్యంలో బ్రాడీపేటలోని శ్రీ షిర్డీసాయి దీన జన సేవా సమితిలో విభిన్న ప్రతిభావంతులకు లింగంశెట్టి చేతుల మీదుగా పండ్లు పంపిణీ చేశారు.

పెనాల్టీ లేకుండా అమ్మకాలకు అనుమతినివ్వాలి

● పొగాకు బోర్డు ఈడీ, ఛైర్మన్‌కు రైతు సంఘాల విజ్ఞప్తి

గుంటూరు సిటీ, జూన్ 19: అదనపు పొగాకునకు అపరాధ రుసుం లేకుండా అమ్ముకోవడానికి అనుమతి ఇప్పించవలసిందిగా రైతుసంఘాల ప్రతినిధులు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్ బాబు, ఛైర్మన్ చిడిపోతు యశ్వంత్ కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం గుంటూరు పొగాకు బోర్డు కార్యాలయంలో వారిని కలిసి వినతిపత్రం అందజేశారు. రైతు సంఘాల నేతల విజ్ఞప్తిపై స్పందించిన పొగాకు బోర్డు అద్దంకి శ్రీధర్‌బాబు, యశ్వంత్ కుమార్ స్పందిస్తూ అపరాధ రుసుం మినహాయింపు విషయంపై ఇప్పటికే కేంద్ర వాణిజ్య శాఖకు సిఫార్సు చేశామని తెలిపారు. ఈ సందర్భంగా ప్రస్తుతం జరుగుచున్న వేలం విధానం గురించి చర్చించారు. రైతుల సౌకర్యార్థం జంగారెడ్డిగూడెం-2 వేలం కేంద్రంకు ఒక కమ్యూనిటీ హాలును నిర్మించాలని రైతు సంఘాల ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు సత్రం వెంకట్రావు, ప్రకాష్‌రావు, అట్లూరి సతీష్, గూడూరి నాగరాజు, పెండ్యాల ప్రసాద్, పరిమి రాంబాబు, కరాటం రెడ్డిబాబు, కూచిపూడి రమేష్, కాకర్ల వివేకానంద, అడపా సత్యనారాయణ, ఇల్లూరి రాంబాబు, గద్దె శేషగిరిరావు, పిన్నమనేని మధుమోహన్ తదితరులు పాల్గొన్నారు.



పొగాకు బోర్డు ఇడి, ఛైర్మన్ కు వినతి పత్రం అందజేస్తున్న రైతుసంఘాల నాయకులు

పఠన ఉపకరణాలు అందించిన ఉపాధ్యాయ దంపతులు

దుగ్గిరాల, జూన్ 19: పేరుకలపూడిలోని ఎంపీ ప్రాథమిక పాఠశాల (హెచ్‌సీ) విద్యార్థులకు పెదపాలెంకు చెందిన ఉపాధ్యాయుడు బుల్లా మరియదాసు, మేరీ గోల్డ్ దంపతులు, తన తండ్రి బుల్లా సుబ్బారావు జ్ఞాపకార్థం విద్యార్థులందరికీ నోటుపుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, ఇతర ఉపకరణాలు అందించారు. సహోపా ధ్యాయులు ప్రదీప్, భూషణం, విద్యాకమిటీసభ్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అమరావతి రైతులపై అక్రమ కేసులు ఎత్తివేసేందుకు చర్యలు తీసుకోవాలి

● సచివాలయంలో హోంమంత్రి అనితకు విన్నవించిన రైతులు

తుళ్లూరు, జూన్ 19: అమరావతిని బ్రహ్మండంగా కడతానని పోయిన ఎన్నికల ముందు చెప్పిన జగన్‌రెడ్డి, అధికారం దక్కగానే మూడు రాజధానులని అమరావతి రాజధానికి 33వేల ఎకరాలిచ్చిన రైతులను మోసం చేశాడని రైతులు అన్నారు. అంతేగాక మూడు ముక్కలాట వద్దు అని శాంతియుతంగా ఉద్యమం చేస్తుంటే లాఠీ చార్జ్ చేయించి అక్రమ కేసులు తమ మీద బనాయించారని హోం మంత్రి వంగలపూడి అనితకు రాజధాని రైతులు బుధవారం సచివాలయంలో ఆమె కలసి వివరించారు. వెలగపూడి సచివాలయంలో అనిత బాధ్యతలు తీసుకున్నారు. రైతు ఆకుపచ్చ రంగు శాలువా మెడలో వేసి రైతులు అభినందనలు తెలిపారు. నాడు నేను రాజధాని రైతు దర్నా శిబిరాలకు వచ్చి పరిస్థితి తెలుసుకున్నానని, సంఘీభావం కూడా తెలిపానని అనిత చెప్పారు. రైతుల మీద పెట్టిన కేసులను ఎత్తివేయటానికి కృషి చేస్తానని ఆమె హామినిచ్చారు. రైతులు జొన్నలగడ్డ శంకర్, అనుమోలు శివలింగయ్య, జే.నాగమల్లేశ్వరావు, నరసింహారావు తదితరులు హోం మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.



సచివాలయంలో హోంమంత్రి అనితను కలిసిన రాజధాని రైతులు

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, జూన్ 19: విద్యుత్ లైన్‌ల నిర్వహణలో భాగంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ పీహెచ్ ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. నందివెలుగు రోడ్డు, గాంధీ నగర్, ఆర్టీసీ కాలనీ, వెంకటరావుపేట, నవభారత్ నగర్, రాఘవనగర్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. అలానే బీఆర్ స్టేడియం ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా బావాజీ మఠం, కమ్యూనిస్టు బొమ్మ సెంటర్, ముగ్దం నగర్ ఏరియాల్లో ఉద యం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహకరిం చాలని కోరారు.

లోకేశ్‌ను కలిసిన రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు



లోకేశ్‌ను కలిసి అభినందనలు తెలుపుతున్న రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు

విజయవాడ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్‌ను స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు బుధవారం కలిశారు. ఆ శాఖ డీఐజీ జి.శ్రీనివాసరావు, విజయవాడలోని జిల్లా రిజిస్ట్రార్ రామారావు, గాంధీనగరం సబ్‌రిజిస్ట్రార్ ప్రసాద్, గుణదల సబ్‌రిజిస్ట్రార్ ప్రసాద్, నల్లపాడు సబ్‌రిజిస్ట్రార్ బి.గోపాల్ కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

గాడి తప్పిన ఏపీ అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

● టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ధారూనాయక్

గుంటూరు, జూన్ 19 : గాడి తప్పిన ఏపీ అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ధారూనాయక్ అన్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబును బుధవారం ఆయన మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ధారూ నాయక్ మాట్లాడుతూ కూటమి ప్రభంజనాన్ని ప్రజలు ఏకపక్షంగా మద్దతు ఇచ్చారన్నారు. అదేవిధంగా గిరిజనులు సైతం కూటమికే మద్దతు ఇచ్చారని అన్నారు. మిమ్మల్ని ముఖ్యమంత్రిగా చూడాలని రాష్ట్ర ప్రజలు ఇంత పెద్ద మెజార్టీలతో ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించారని, గాడి తప్పిన ఆంధ్రప్రదేశ్‌ని మరల అభివృద్ధి బాటలో నడిపించాలంటే అది మీ వలనే అవుతుందని ప్రజలు బలంగా నమ్మారన్నారు. రాష్ట్రంలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని ఆయన అన్నారు. గడచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం సాగించిన అక్రమాలు, గిరిజనులపై చేసిన అఘాయిత్యాలను గిరిజనులు సహించలేక పోయారన్నారు.




సీఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలసి మొక్కను అందిస్తున్న ధారూనాయక్

వైసీపీ సలహాదారుల ఆర్థిక వ్యవహారాలపై విచారణ జరపాలి

● డాక్టర్ నిమ్మల శేషయ్య

గుంటూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో సలహాదారుల పేరిట పార్టీ కార్యకర్తలకు కోట్లాది రూపాయలు దోచిపెట్టిన వ్యవహారంపై తెలుగుదేశం ప్రభుత్వం విచారణ జరపాలని టీడీపీ నాయకుడు డాక్టర్ నిమ్మల శేషయ్య కోరారు. గుజ్జనగుండ్లలోని తన కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కనీస అర్హతలు లేనివారికి సలహాదారుల పేరిట వైసీపీ ప్రభుత్వం నామినేటెడ్ పదవులు కేటాయించి ప్రభుత్వ ఖజానాను కొల్లగొట్టిందన్నారు. వైసీపీ పాలనలో సలహాదారుల జీతభత్యాల పేరిట ఎంత ప్రజాధనం వృథా చేసిందో శ్వేత పత్రం ద్వారా ప్రజలకు తెలియజేయాలని కోరారు. సజ్జల రామకృష్ణారెడ్డికి సంబంధించిన ఆర్థిక చెల్లింపులపై పూర్తిస్థాయి నివేదిక ప్రజల ముందుంచాలని ఆయన విజ్ఞప్తి చేశారు. బీసీ కార్పొరేషన్ ద్వారా ఎంతమంది వైసీపీ కార్యకర్తలకు ఎంత ప్రభుత్వ ధనాన్ని దోచి పెట్టారో కూటమి ప్రభుత్వం ప్రజలకు తెలియజేయాలని ఆయన కోరారు. వైసీపీ హయాంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై, వైసీపీ ఆర్థిక దోపిడీపై బహిరంగ నివేదిక ద్వారా వైసీపీ అక్రమాలను ప్రజలకు తెలియజెప్పాలని శేషయ్య కోరారు.



డాక్టర్ నిమ్మల శేషయ్య

ఆన్‌లైన్ సేవల వినియోగంలో జాగ్రత్త వహించాలి

గుంటూరు, జూన్ 19: రాష్ట్రంలోని పింఛన్‌దారులు ఆన్‌లైన్ సేవల వినియోగంలో తగిన జాగ్రత్తలు తీసుకో వాలని పెన్షన్‌దారుల చర్చా వేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య సూచించారు. ఒక వ్యక్తి కొంత కాలంగా ఈ మెయిల్ అకౌంట్ కలిగి ఉన్నాడని, ఇటీవల తన ఖాతాను తెరవ గానే ఎవరో మహారాష్ట్రకు చెందిన గుర్తుతెలియని వ్యక్తి ఆయన ఖాతాను ఓపెన్ చేశా రని, వీలైనంత త్వరగా పాస్‌వర్డ్‌ను మార్చాలని సదరు మెయిల్ నిర్వాహకులు సమాధానమిచ్చారన్నారు. ఈ సంఘటనికి కారణం పాస్‌వర్డ్ హ్యాకింగ్ జరగటమేన న్నారు. రోజురోజుకు ఆన్‌లైన్ బ్యాంకింగ్ అంతర్జాల వినియోగం పెరిగిపోతుందని, వ్యక్తిగతంగా వినియోగించే ఈ సౌకర్యంతో పాటు ఆన్‌లైన్‌లో మెయిల్ ఐడీలు కావా లన్నా, ఏటీఎం, డెబిట్, క్రెడిట్ కార్డులు సరిగా ఉపయోగపడాలంటే సురక్షితమైన పాస్‌వర్డ్ అవసరమన్నారు. పాస్‌వర్డ్ పట్ల ఏమాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినా తరువాత ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. మరి ఆ పాస్‌వర్డును ఎలా పరిరక్షించుకోవాలన్న విషయమై పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇటీవల ఆన్‌లైన్ దరఖాస్తు విధానం పెరిగిపోయిందన్నారు. విద్యార్థుల ఉపకార వేతనాలు, ప్రవేశ పరీక్షల దరఖాస్తులు ఇలా అన్నీ ఆన్‌లైన్ లోనే జరుగుతున్నాయన్నారు. ఈ వివరాలను ఆన్‌లైన్‌లో విదేశాల్లో ఉన్న ముఠాకు చేరవేస్తారని, వార్డు కార్డును డీ కోడ్ చేసి జిప్ ఫోల్డర్ లో గానీ, ఆర్ఆర్ ఫోల్డర్‌లో గానీ ఇక్కడికి సమాచారం చేరవేస్తారన్నా రు. విదేశాల నుంచి తెప్పించిన ఖాళీ క్రెడిట్ కార్డులపై ఎన్‌కోడర్‌తో మాగ్నెటిక్ స్ట్రిప్‌ను తయారు చేసి అంటిస్తారన్నారు. అంతే కాదు పిన్ నెంబరును మార్చేస్తారన్నారు. ఇంకేం ఈ కార్డుతో ఎంచక్కా కొనుగోలు చేయవచ్చన్నారు. పాస్‌వర్డ్ ఎంపికలో జాగ్రత్తలు అవసర మన్నారు. కఠినంగా ఉండే పదాలను ఎంపిక చేసుకోవాలన్నారు. అం కెలు, గుర్తులు ఉపయోగించుకోవాలన్నారు. చిన్నా పెద్ద అక్షరాలతో కూడిన అక్షరాలతో చూసుకోవాలన్నారు. ఒక వేళ పాస్‌వర్డ్‌ను మర్చి పోతే సపోర్ట్ టీంలో ఉండే సంబంధిత నిర్వాహకులకు కాంటాక్ట్ అజ్, ఫర్ గాట్ పాస్‌వర్డ్ మాత్రమే సంప్రదించాలన్నారు. ఈ జాగ్రత్తలన్నీ పాస్‌వర్డ్ నిర్వహణలో చూసుకోవా లని పింఛన్ దారులను వీరయ్య కోరారు.

గుండాలపాడు పాఠశాలలో పుస్తకాల పంపిణీ

ఫిరంగిపురం, జూన్ 19 : మండలంలోని గుండాలపాడు గ్రామంలో ఎంపీపీ పాఠశాలలో పుస్తకాలను సర్పంచ్ కాండ్రు దానయ్య విద్యార్థులకు పంపిణీ చేశారు. బుధవారం గ్రామంలోని పలు పాఠశాలల్లో సర్పంచ్ ప్రభుత్వం ఇచ్చిన అచ్చు పుస్తకాలను, బ్యాగ్‌లను పంపిణీ చేశారు. అంతేగాక వేములూరిపాడు గ్రామంలో కూడా తెలుగుదేశం పార్టీ నాయకులు పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆళ్ళ కృష్ణమూర్తి, కొల్లి వసంతరావు, కట్టా కోటేశ్వరరావు, మాజీ సర్పంచ్ బోడిపాటి వెంకయ్య, ఏసురత్నం, జ్యోతి, ప్రధానోపాధ్యాయులు, శ్రీనివాసరావు, ఆర్ రాజశేఖర్, తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దిక్సూచి
DIKSUCHI

'కథక్ కేంద్ర'లో నృత్యం, సంగీతం



న్యూఢిల్లీలోని కథక్ కేంద్ర(నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కథక్ డ్యాన్స్)- సంగీతం, కథక్ నృత్యం కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. హిందీ మాధ్యమంలో బోధన ఉంటుంది. అభ్యర్థులకు హిందీ, ఇంగ్లీష్ భాషలు చదవడం, రాయడం తెలిసి ఉండాలి. అడ్మిషన్ టెస్ట్‌లో సాధించిన మెరిట్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ఎంపికైన అభ్యర్థులకు స్టయిపెండ్ సౌకర్యం ఉంది.

కథక్ డ్యాన్స్: ఇందులో రెండు ఎలిమెంటరీ కోర్సులు, నాలుగు అడ్వాన్స్‌డ్ కోర్సులు ఉన్నాయి.

- **ఎలిమెంటరీ కోర్సులు:** అయిదేళ్ల ఫౌండేషన్ కోర్సు, మూడేళ్ల డిప్లొమా కోర్సు
- **అడ్వాన్స్‌డ్ కోర్సులు:** ఏడాది వ్యవధిగల ప్రిపరేటరీ ఫేజ్ కోర్సు, మూడేళ్ల డిప్లొమా ఆనర్స్ కోర్సు, రెండేళ్ల పోస్ట్ డిప్లొమా కోర్సు, ఆర్నెల్ల రిఫ్రెషర్ కోర్సు

సంగీతం: ఇందులో ఏడాది వ్యవధిగల సర్టిఫికెట్ కోర్సు(తబలా/పఖవాజ్/సారంగి/ఓకల్), మూడేళ్ల డిప్లొమా స్పెషల్ కోర్సు(తబలా/పఖవాజ్/సారంగి/ఓకల్) ఉన్నాయి.

నృత్యం కోర్సులకు అర్హత: ఫౌండేషన్ కోర్సులో ప్రవేశానికి కనీసం మూడోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థులకు జూన్ 1 నాటికి 10 నుంచి 15 ఏళ్ల మధ్య వయసు ఉండాలి. కథక్ నృత్యంలో పరిచయం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.

- డిప్లొమా కోర్సులో ప్రవేశానికి కనీస తొమ్మిదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థులకు జూన్ 1 నాటికి 15 నుంచి 20 ఏళ్ల మధ్య వయసు ఉండాలి. సంగీతం, థియేటర్ ఆర్ట్స్, విజువల్ ఆర్ట్స్‌లో ఆసక్తి/అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.
- డిప్లొమా ఆనర్స్ కోర్సులో ప్రవేశానికి ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణతతోపాటు డిప్లొమా (కథక్) పూర్తి ఉండాలి. అభ్యర్థులకు జూన్ 1 నాటికి 19 నుంచి 23 ఏళ్ల మధ్య వయసు ఉండాలి. హిందుస్థానీ ఓకల్ మ్యూజిక్, తబల/పఖవాజ్ శిక్షణ పొందినవారికి; లిటరేచర్, థియేటర్ ఆర్ట్స్, విజువల్ ఆర్ట్స్‌లో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.
- పోస్ట్ డిప్లొమా కోర్సులో ప్రవేశానికి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు డిప్లొమా ఆనర్స్(కథక్) పూర్తిచేసి ఉండాలి. అభ్యర్థుల వయసు జూన్ 1 నాటికి 21 నుంచి 26 ఏళ్ల మధ్య ఉండాలి. లిటరేచర్, విజువల్ ఆర్ట్స్‌లో ఆసక్తి ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.
- రిఫ్రెషర్ కోర్సులో ప్రవేశానికి పోస్ట్ డిప్లొమా కోర్సు పూర్తిచేసి ఉండాలి. డ్యాన్స్ టీచర్‌గా పనిచేస్తూ ఉండాలి. అభ్యర్థుల వయసు జూన్ 1 నాటికి 40 ఏళ్లలోపు ఉండాలి.

సంగీతం కోర్సులకు అర్హత: సర్టిఫికెట్ కోర్సులో ప్రవేశానికి అభ్యర్థులకు జూన్ 1 నాటికి 19 నుంచి 21 ఏళ్ల మధ్య వయసు ఉండాలి. ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణతతోపాటు ఓకల్ మ్యూజిక్‌లో అవగాహన తప్పనిసరి.

- డిప్లొమా స్పెషల్ కోర్సులో ప్రవేశానికి అభ్యర్థులకు 20 నుంచి 25 ఏళ్ల మధ్య వయసు ఉండాలి. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు ఓకల్ మ్యూజిక్‌లో పరిజ్ఞానం ఉండాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.200
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 26
- **అడ్మిషన్ టెస్ట్ తేదీలు:** నృత్యంలో ఎలిమెంటరీ కోర్సులకు జూలై 2, 3, 4; నృత్యంలో అడ్వాన్స్‌డ్ కోర్సులు, సంగీతం కోర్సులకు జూలై 8, 9, 10
- **ఈ-మెయిల్:** admission@kathakkendra.in
- **వెబ్‌సైట్:** www.kathakkendra.in

ఐఐటీ ఇండోర్‌లో ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ

ఇండోర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ) ఆధ్వర్యంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోసైన్సెస్ అండ్ బయో మెడికల్ ఇంజనీరింగ్- 'ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ బయోటెక్నాలజీ(జీఏటీ) 2024 స్కోర్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. అడ్మిషన్ పొందినవారికి నెలకు రూ.5,000ల ఫెలోషిప్ ఇస్తారు. రీసెర్చ్‌పై ఆసక్తి గల అభ్యర్థులు మూడో సెమిస్టర్‌లో ఎమ్మెస్సీ+పీహెచ్‌డీ డ్యూయెల్ డిగ్రీ ప్రోగ్రామ్‌లోకి మారవచ్చు.



అర్హత వివరాలు: గుర్తింపు పొందిన కళాశాల నుంచి మూడు/నాలుగు/అయిదేళ్ల డిగ్రీ(బయాలజీ/బయోటెక్నాలజీ/అగ్రికల్చర్-బయాలజీ ఒక సబ్జెక్టుగా) ఉత్తీర్ణులై ఉండాలి. ప్రథమశ్రేణి మార్కులు తప్పనిసరి. గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ బయోటెక్నాలజీ(జీఏటీ) 2024 అర్హత పొంది ఉండాలి. పీహెచ్‌డీలోకి మారాలనుకునేవారు సీఎస్ఐఆర్/యూజీసీ/డీబీటీ జేఆర్ఎఫ్ అర్హత పొంది ఉండాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 21
- **దరఖాస్తుతోపాటు అప్‌లోడ్ చేయాల్సిన పత్రాలు:** పదోతరగతి, ఇంటర్ మార్కుల పత్రాలు, సర్టిఫికెట్‌లు; జీఏటీ-బీ 2024 ర్యాంక్ కార్డ్; కులం, వైకల్యం ధ్రువీకరణ పత్రాలు; అభ్యర్థి ఫొటో, సంతకం
- **వెబ్‌సైట్:** www.iiti.ac.in

ఉస్మానియా వర్సిటీలో ఇంటర్న్‌షిప్

హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన 'ప్రొఫెసర్ టీ.నవనీత రావు సెంట్రల్ ఫెసిలిటీస్ ఫర్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగం- నాలుగో ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తోంది. ప్రోగ్రామ్ వ్యవధి వారం. ఇందులో రీసెర్చ్ టెక్నిక్స్, టెక్నికల్ స్కిల్స్‌కు సంబంధించి శిక్షణ ఇస్తారు. జూన్ 24 నుంచి 29 వరకు ప్రతిరోజూ ఉదయం పది గంటల నుంచి సాయంత్రం అయిదు గంటల వరకు శిక్షణ తరగతులు, వర్క్‌షాప్‌లు ఉంటాయి. లైఫ్ సైన్సెస్, ఫార్మసీ, కెమిస్ట్రీ విభాగాలకు చెందిన ఫ్యాకల్టీ మెంబర్లు, పీహెచ్‌డీ స్కాలర్స్, పీజీ స్టూడెంట్స్ దరఖాస్తు చేసుకోవచ్చు. మొత్తం 40 మందికి అవకాశం కల్పిస్తారు. ఎంపికైన అభ్యర్థులు నిర్దేశిత రుసుం చెల్లించి వర్సిటీ గెస్ట్ హౌస్‌లో వసతి సౌకర్యం పొందవచ్చు. అభ్యర్థులందరూ ల్యాబ్ కోట్, మాస్క్ వెంట తెచ్చుకోవాలి. ప్రోగ్రామ్ చివరలో అభ్యర్థులకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు ఇస్తారు.

- **రిజిస్ట్రేషన్ ఫీజు:** రూ.3,500
- **ఈ-మెయిల్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 23
- **ఈ-మెయిల్:** cfrdou@gmail.com
- **వెబ్‌సైట్:** www.osmania.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/475qNlnలో చదవండి.

కొండా లక్ష్మణ్ వర్సిటీలో హార్టికల్చర్ డిప్లొమా

ములుగు(సిద్దిపేట్)లోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ స్టేట్ హార్టికల్చరల్ యూనివర్సిటీ(ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యూ)- 'డిప్లొమా ఇన్ హార్టికల్చర్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రభుత్వ, ప్రైవేట్ అనుబంధ పాలిటెక్నిక్ కళాశాలల్లో అడ్మిషన్స్ ఇస్తారు. ఒక్కో కళాశాలలో 40 చొప్పున మొత్తం 200 సీట్లు ఉన్నాయి. వీటిలో 60 శాతం సీట్లను గ్రామీణ విద్యార్థులకు, 40 శాతం సీట్లను పట్టణ ప్రాంతాల విద్యార్థులకు కేటాయించారు. తెలంగాణ పాలిసెట్ 2024 ర్యాంక్/పదోతరగతి మార్కుల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. స్థానికులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు

- ఆదిలాబాద్ హార్టికల్చర్ పాలిటెక్నిక్
- రామగిరిఖిల్లా హార్టికల్చర్ పాలిటెక్నిక్
- కొల్లాపూర్ హార్టికల్చర్ పాలిటెక్నిక్

అనుబంధ పాలిటెక్నిక్ కళాశాలలు

- గంట గోపాల్ రెడ్డి హార్టికల్చర్ పాలిటెక్నిక్- గడ్డిపల్లి, సూర్యాపేట్ జిల్లా
- విశ్వధరణి హార్టికల్చర్ పాలిటెక్నిక్-తొర్రూరు, మహబూబాబాద్ జిల్లా



అర్హత: అభ్యర్థులు కనీసం 35 శాతం మార్కులతో పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. తెలంగాణ పాలిసెట్ 2024లో అర్హత పొంది ఉండాలి. సీబీఎస్ఈ/ఐసీఎస్ఈ/ఎన్ఐఓఎస్/టీఓఎస్ఎస్ నుంచి సైన్స్ ఒక సబ్జెక్టుగా పదోతరగతి పూర్తిచేసినవారు, ఇంటర్ ఫెయిల్ అయిన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్/హయ్యర్ డిగ్రీ కోర్సులు పూర్తిచేసినవారు దరఖాస్తుకు అనర్హులు. 2024 డిసెంబరు 31 నాటికి అభ్యర్థుల వయసు 15 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

- **ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1100; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.600
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 15
- **వెబ్‌సైట్:** www.skltshu.ac.in

దామోదరం సంజీవయ్య వర్సిటీలో ఎల్ఎల్‌బీ

విశాఖపట్నంలోని దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ(డీఎస్ఎన్ఎల్‌యూ)- ఎల్ఎల్‌బీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. దేశవ్యాప్తంగా వర్సిటీ నిర్వహించే ఎంట్రెన్స్ టెస్ట్(డీఈటీ) ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

సీట్ల వివరాలు: మొత్తం 138 సీట్లు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ స్టేట్ కేటగిరీ కింద 66 సీట్లు, ఆలిండియా కేటగిరీ కింద 54 సీట్లు, మిగిలినవి వేరే కేటగిరీలకు కేటాయించారు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి మూడేళ్ల వ్యవధి గల ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.2,500; బీసీ, ఓబీసీ అభ్యర్థులకు రూ.2,200; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1800
- **ఈ-మెయిల్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 12
- **ఈ-మెయిల్:** admissions@dsnlu.ac.in
- **వెబ్‌సైట్:** https://dsnlu.ac.in



నా కెరీర్‌లో కల్కి లాంటి సినిమా చేయలేదు

అమితాబ్ బచ్చన్

'కల్కి 2898 ఏడీ' చిత్రంలో భాగమవడం గొప్ప గౌరవంగా భావిస్తున్నాను. ఇదో కొత్త ప్రపంచం, నా కెరీర్‌లో ఇప్పటిదాకా ఇలాంటి సినిమా చేయలేదు. 'కల్కి' చిత్రీకరణలో అనుభవాలను ఎప్పటికీ మర్చిపోలేను' అని అమితాబ్ బచ్చన్ అన్నారు.

ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ తెరకెక్కించిన చిత్రమిది. అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్ సహా పలువురు అగ్రనటులు కీలకపాత్రలు పోషించారు. దీపికా పదుకొనే, దిశాపటానీ కథానాయికలు. వైజయంతీ మూవీస్ బేనర్‌పై సి. అశ్వనీదత్ నిర్మించారు. ఈ నెల 27న ఈ చిత్రం విడుదలవుతోంది. బుధవారం ముంబైలో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా అమితాబ్ బచ్చన్ మాట్లాడుతూ 'ఓ వినూత్నమైన చిత్రానికి రూపకల్పన చేసిన నాగ్ అశ్విన్, అతని బృందానికి నా అభినందనలు. ఆయన ఈ కథ చెప్పినప్పుడు ఆశ్చర్యపోయాను. అయన ఇలాంటి కథని ఎలా ఆలోచించగలిగాడో అనిపించింది. ఈ చిత్రంలో విజువల్స్ అసాధారణంగా ఉంటాయి. తన ఆలోచనలను తెరపైన అద్భుతంగా ఆవిష్కరించగలిగాడు. ఈ ఫ్యూచరిస్టిక్ ప్రాజెక్ట్ ఓ మహా అద్భుతం' అని నాగ్ అశ్విన్‌ను ప్రశంసించారు.



తన పాదాలకు నమస్కరించబోతున్న అమితాబ్‌ను వారిస్తున్న అశ్వనీదత్

కమల్‌హాసన్ మాట్లాడుతూ 'నాగ్ అశ్విన్ కూడా మా గురువుగారు బాలచందర్‌లా సాదాసీదాగా కనిపిస్తాడు కానీ అసాధారణ ప్రజ్ఞావంతుడు. తన ఆలోచనలను సృజనాత్మకంగా తెరకెక్కించగల నేర్పు నాగ్ అశ్విన్‌లో అపారంగా ఉంది. ఇందులో ప్రతినాయక ఛాయలున్న పాత్ర నాది. మంచి వినోదం పంచుతుంది. నా ఫస్ట్‌లుక్‌లానే సినిమా కూడా మిమ్మల్ని ఆశ్చర్యపరుస్తుంది' అన్నారు.

ప్రభాస్ మాట్లాడుతూ 'దిగ్గజాలతో పనిచేసే అవకాశం కల్పించిన అశ్వనీదత్, నాగీకి ధన్యవాదాలు. దేశవ్యాప్తంగా పాపులారిటీ సాధించిన తొలి భారతీయ నటుడు అమితాబ్‌బచ్చన్. ఆయన నుంచి చాలా నేర్చుకున్నాను. నా చిన్నప్పుడు కమల్‌హాసన్ గారి సినిమాలు చూసి ఆయనలా నటించేవాణ్ణి. దీపిక అంతర్జాతీయ స్థాయిలో రాణించారు. ఇంతమంది గొప్ప నటులతో కలసి నటించానంటే నమ్మలేకపోతున్నాను' అని చెప్పారు. దీపికా పదుకొనే మాట్లాడుతూ 'నాగీ క్రియేట్ చేసిన మ్యాజిక్ 'కల్కి' చిత్రం. ఆయనో జీనియస్. తనలో చాలా స్పష్టత ఉంది. సినిమాను అద్భుతంగా తీశారు. నటిగా నాకు గొప్ప అనుభవం మిగిల్చిన సినిమా ఇది' అన్నారు. అశ్వనీదత్ మాట్లాడుతూ 'అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, ప్రభాస్, దీపిక సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించినందుకు ఆనందంగా ఉంది. 'కల్కి' గొప్ప విజయాన్ని అందుకోవాలని ఆకాంక్షిస్తున్నాను' అన్నారు.

కూల్ అవ్వండి మేడం గారు



విభిన్న భాషల్లో సినిమాలు చేస్తూ నటుడిగా జాతీయ స్థాయిలో చక్కని గుర్తింపు సొంతం చేసుకున్నారు దుల్కర్ సల్మాన్. తెలుగులోనూ 'మహానటి', 'సీతారామం' లాంటి చిత్రాలతో విజయాలను అందుకున్నారు. ఆయన తాజాగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'లక్కీ భాస్కర్'. వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్టైన్‌మెంట్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. 'లక్కీ భాస్కర్ చిత్రంలో బ్యాంక్ క్యాషియర్‌గా మునుపెన్నడూ చూడని కొత్త లుక్‌లో దుల్కర్ సల్మాన్ కనిపించనున్నారు. ఈ చిత్రం నుంచి 'కోపాలు చాలండి శ్రీమతి గారు...కొంచెం కూల్ అవ్వండి మేడం గారు' అంటూ సాగే గీతాన్ని యూనిట్ బుధవారం విడుదల చేసింది. జీవీ ప్రకాశ్ కుమార్ ప్రత్యేక శైలిలో స్వరపరిచిన ఈ గీతాన్ని విశాల్ మిశ్రా, శ్వేతా మోహన్‌లు ఆలపించారు. శ్రీమణి సాహిత్యం ఈ గీతానికి ప్రత్యేకాకర్షణగా నిలిచింది. దుల్కర్ సరసన మీనాక్షి చౌదరి కథానాయికగా నటిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: నిమిష్ రవి, ఎడిటర్:నవీన్ నూలి

ఎస్‌కే 30 షురూ



ఇప్పటిదాకా లవ్‌స్టోరీలు, మాస్ యాక్షన్ ఎంటర్టైనర్‌లతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన సందీప్ కిషన్ తన పంథా మార్చారు. తన కెరీర్‌లో చేయని సరికొత్త కథాంశంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆయన హీరోగా రూపొందుతున్న 30వ చిత్రం (ఎస్‌కే 30)లో ఓ సరికొత్త పాత్రలో అలరించబోతున్నారు. ప్రేమ, భావోద్వేగాలు, కుటుంబ అనుబంధాలు చుట్టూ అల్లుకున్న కథ ఇది. బుధవారం ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ హైదరాబాద్‌లో ప్రారంభమైంది. పలు బ్లాక్‌బస్టర్ ఎంటర్టైనర్‌లను అందించిన త్రినాథరావు నక్కిన 'ఎస్‌కే 30'కు దర్శకత్వం వహిస్తున్నారు. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్, హాస్య మూవీస్, జీ స్టూడియోస్ కలయికలో రాజేశ్ దండా భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. రావు రమేశ్ కీలకపాత్ర పోషిస్తున్నారు. ప్రసన్నకుమార్ బెజవాడ కథ, మాటలు అందిస్తున్నారు. లియోన్ జేమ్స్ సంగీత సారథ్యం వహిస్తున్నారు. డీవోపీ: నిజార్ షఫీ. ఎడిటర్: చోటా కే ప్రసాద్. బాలాజీ గుత్తా సహనిర్మాతగా వ్యవహరిస్తున్నారు.

ఆధ్యాత్మిక అంశాలతో...



అశ్విన్‌బాబు, అర్బాజ్‌ఖాన్, దిగంగనా సూర్యవంశీ ప్రధాన తారాగణంగా రూపొందుతున్న చిత్రం 'శివం భజే'. బ్రహ్మాజీ, దేవి ప్రసాద్, కాశీ విశ్వనాథ్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. అప్సర్ దర్శకత్వంలో మహేశ్వర్‌రెడ్డి మూలి నిర్మిస్తున్నారు. బుధవారం 'శివంభజే' టీజర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఆధ్యాత్మిక అంశాలకు యాక్షన్ హంగులను మేళవించి రూపొందించిన చిత్రమిదని టీజర్‌ను బట్టి తెలుస్తోంది. జూలైలో 'శివం భజే'ను విడుదల చేస్తామని నిర్మాత తెలిపారు. టైటిల్‌తోనే మా సినిమా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిందని దర్శకుడు చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం:వికాస్ బడిస, సినిమాటోగ్రఫీ: దాసరథి శివేంద్ర

'నింద' అందరికీ నచ్చుతుంది




'కాంద్రకోట మిస్టరీ' అని మా సినిమా పోస్టర్ వదిలినప్పుడు అందరూ ఇది ఘోస్ట్ సినిమా అనుకున్నారు. టీజర్ తర్వాత అందరికీ ఓ క్లారిటీ వచ్చింది. వరుణ్ సందేశ్‌కు ఇది తగిన క్యారెక్టర్. ఆయనకు ఇది కమ్ బ్యాక్ సినిమా అవుతుంది' అన్నారు రాజేశ్ జగన్నాథం. వరుణ్‌సందేశ్ హీరోగా ఆయన స్వీయ దర్శకత్వంలో నిర్మించిన 'నింద' చిత్రం ఈ నెల 21న విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ 'ఈ కథ మీద నాకు నమ్మకం ఉంది. నిర్మాతల కోసం ప్రయత్నించా. ఆ తర్వాత వేరే వాళ్లు ఎందుకని నేనే నిర్మాతగా మారా. నాకు క్రియేటివ్ ఫీల్డ్ అంటే ఇష్టం. దర్శకత్వ శాఖ నాకు నచ్చింది. సినిమా తీయడం ఇష్టం కూడా. అయితే తీసిన సినిమాను విడుదల చేయడం ఎంత కష్టమో ఇప్పుడు అర్థమవుతోంది' అని ఆయన చెప్పారు.

ఆర్కిటెక్ట్ నిత్య



'మనమే' చిత్రంతో మంచి హిట్‌ను తన ఖాతాలో వేసుకున్నారు శర్వానంద్. ఇప్పుడు తన తదుపరి చిత్రం (శర్వా 37-వర్కింగ్ టైటిల్) షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ఈ చిత్రానికి 'సామజ వరగమన' సినిమాతో మంచి విజయాన్ని సొంతం చేసుకున్న రామ్ అబ్బరాజు దర్శకత్వం వహిస్తున్నారు. అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్నారు. 'ఏజెంట్' చిత్రంలో తన గ్లామర్‌తో అలరించిన సాక్షి వైద్య శర్వాకు జోడీగా నటిస్తున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. బుధవారం సాక్షి పుట్టిన రోజు సందర్భంగా చిత్రబృందం ఆమె పాత్రను పరిచయం చేసింది. ఆర్కిటెక్ట్ నిత్య పాత్రలో సాక్షి కనిపించనున్నారు. ఫ్యామిలీ ఎంటర్టైనర్‌గా తెరకెక్కుతోన్న ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తుండగా, జ్ఞానశేఖర్ వీఎస్ సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు. అజయ్ సుంకర సహ నిర్మాత.

నా కెరీర్‌లో బెస్ట్ థ్రిల్లర్



నవీన్‌చంద్ర హీరోగా తెలుగు, తమిళ భాషల్లో రూపొందిన ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ 'లెవెన్'. లోకేశ్ అజ్ల్స్ దర్శకత్వంలో అజ్మల్ ఖాన్, రేయా హరి నిర్మిస్తున్నారు. ఈ సినిమా టీజర్‌ను హీరో నిఖిల్ ట్విట్టర్ ద్వారా విడుదల చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో హీరో నవీన్‌చంద్ర మాట్లాడుతూ 'ఈ కథ వినగానే నచ్చేసింది. స్క్రిప్ట్ కోసం ఇంత ప్యాషన్‌గా పని చేసిన నిర్మాతలను నేను చూడలేదు. తప్పకుండా మంచి విజయం సాధిస్తారు. నా కెరీర్‌లో బెస్ట్ థ్రిల్లర్ అవుతుంది' అని చెప్పారు. నిర్మాతల్లో ఒకరైన రేయా హరి మాట్లాడుతూ 'తెలుగులో నాకు ఇది మొదటి సినిమా. ఇందులో భాగం కావడం ఆనందంగా ఉంది' అన్నారు. 'మాకు ఇది మూడో సినిమా. మొదటి రెండు చిత్రాలూ హిట్ అయ్యాయి. తెలుగు, తమిళ భాషల్లో విడివిడిగా తీశాం. ఇది ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్. అందరికీ నచ్చుతుంది' అని మరో నిర్మాత అక్బర్ చెప్పారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోందనీ, త్వరలోనే థియేటర్లలో చిత్రాన్ని విడుదల చేస్తామనీ నిర్మాతలు చెప్పారు.

ఆకట్టుకునే సినిమా కథ



అభిరామ్, వెన్నెల, మనోహర్, పవన్, కృష్ణ, మంజుల హీరోహీరోయిన్లుగా నటించిన చిత్రం 'ఇట్లు.. మీ సినిమా' ఈ నెల 21న విడుదల కానుంది. నలుగురు యువకులు సినిమా మీదున్న ప్యాషన్‌తో చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టి ఎటువంటి సవాళ్లు ఎదుర్కొన్నారు.. అనే కథాంశంతో రూపుదిద్దుకున్న చిత్రమిది. లవ్, రొమాన్స్, కామెడీ, సెంటిమెంట్ అంశాలతో రూపుదిద్దుకున్న ఈ చిత్రానికి హరీశ్ చావా దర్శకుడు. నోరి నాగప్రసాద్ నిర్మాత. ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేసిన సందర్భంగా ప్రసాద్ ప్రీవ్యూ థియేటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దర్శకుడు హరీశ్ చావా మాట్లాడుతూ 'సినిమా కథ కోసం అన్వేషిస్తున్నప్పుడు ఏ కథో ఎందుకు.. సినిమా ఇండస్ట్రీలో పడే ఇబ్బందుల గురించి సినిమా తీద్దాం అన్నారు మా నిర్మాత. పరిశ్రమలోకి అడుగుపెట్టే వారికి అవగాహన కల్పించే విధంగా మా సినిమా ఉంటుంది. ప్రేక్షకులందరికీ తప్పకుండా నచ్చుతుంది' అని చెప్పారు. 'పరిశ్రమలోకి వచ్చే కొత్త వాళ్లు పడే ఇబ్బందుల్ని ఆసక్తికరంగా, ప్రేక్షకులకు నచ్చే రీతిలో చూపించాం. ఈ నెల 21న విడుదల చేస్తున్నాం. చిన్న సినిమా కనుక దయచేసి అందరూ థియేటర్లకు వెళ్లి చూడండి' అని కోరారు నిర్మాత నాగప్రసాద్. ఈ కార్యక్రమంలో హీరో అభిరామ్, హీరోయిన్ వెన్నెల, తెలుగు నిర్మాతలమండలి కార్యదర్శి ప్రసన్నకుమార్, దర్శకుల సంఘం అధ్యక్షుడు వీరశంకర్ తదితరులు పాల్గొన్నారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/cyup3CB లో చదవండి.

ఎంఎల్ఎస్ పాయింట్‌లో తూనికల శాఖ అధికారుల తనిఖీ



తాడికొండ సివిల్ సప్లై గోడౌన్‌లో తనిఖీలు చేస్తున్న తూనికల, కొలతశాఖ జాయింట్ కంట్రోలర్ మాధురి

తాడికొండ, జూన్ 19: తాడికొండలోని ఎంఎల్ఎస్ పాయింట్‌లో తూనికల, కొలతలశాఖ అధికారులు ఆకస్మికంగా తనిఖీలను బుధవారం నిర్వహించారు. కందిపప్పు, పంచదార, ఆయిల్ ప్యాకెట్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లీగల్ మెట్రాలజీ జాయింట్ కంట్రోలర్ ఎంఎస్ఎస్ మాధురి మాట్లాడుతూ తనిఖీల్లో కందిపప్పు, పంచదార ప్యాకెట్లలో 15గ్రాముల వరకు తరుగు ఉన్నట్లు గుర్తించామన్నారు. కందిపప్పు, పంచదార సప్లై చేసే వారి నుంచే తరుగు వస్తున్నట్లు తెలిపారు. దీంతో సరుకును సప్లై చేసే వారిపై కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో సరుకుల పంపిణీ కీలకమని.. కార్డుదారులకు సరుకులు సక్రమంగా అందించటమే ధ్యేయమని అన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కంట్రోలర్ జీ కొండారెడ్డి, ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌ఛార్జ్ టీ నరసింహామూర్తి, సీఎస్ ఆర్ఐ ఇంటూరి అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పుస్తకాలు, బ్యాగుల పంపిణీ



దొండపాడు ప్రభుత్వ పాఠశాలలో పుస్తకాలను విద్యార్థులకు అందిస్తున్న షైనేని గిరిజా, కొమ్మినేని శివయ్య

తుళ్లూరు, జూన్ 19: మండలపరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, స్కూల్ బ్యాగులు బుధవారం పంపిణీ చేశారు. దొండపాడు, తుళ్లూరు, మందడం ప్రభుత్వ ఎలి మెంటరి పాఠశాలలో పంపిణీ కార్యక్రమం జరిగింది. దొండపాడులో మాజీ ఎంపీటీసీ షైనేని గిరిజా, మాజీ సర్పంచ్ కొమ్మినేని శివయ్య, తుళ్లూరులో టీడీపీ నేతలు జొన్నలగడ్డ శంకర్, బోదాల రవి, జమ్ముల కిరణ్, మందడంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు ఆలూరి సుబ్రహ్మణ్యం, మండల మహిళా అధ్యక్షురాలు ఎర్రమనేని నాగమల్లేశ్వరి, గుంటూరు పార్లమెంట్ వాణిజ్య విభాగం కార్యదర్శి వాకచర్ల వీరాంజనేయులు, నాయకులు మాదల పున్నయ్య, ఆలూరి బుజ్జిబాబు, పేరం రాములు, చిన్న భూషయ్య, బెజవాడ హనుమంతురావు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ ఆదేశాల మేరకు పుస్తకాలు, బ్యాగుల పంపిణీ చేశామని కార్యక్రమంలో పాల్గొన్న నేతలు ఈ సందర్భంగా తెలిపారు.

ఘనంగా బాలాజీగుప్తా జన్మదిన వేడుకలు

మంగళగిరి, జూన్ 19: టీడీపీ సీనియర్ నేత, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ సంకా బాలాజీగుప్తా జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ, జనసేన నేతలు గుప్తాను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేకును ఆయన కట్ చేశారు. జనసేన చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి జంజనం వెంకట సాంబశివరావు, టీడీపీ నేతలు కొత్తపల్లి శ్రీనివాసరావు, విన్నకోట శ్రీనివాసరావు, చీకుల వెంకటేశ్వరరావు, సుఖమంచి గిరిబాబు, రంగిశెట్టి సీతయ్య, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

కాలువల్లోని షట్టర్లు, గేర్ బాక్సులు మాయం

● పది రోజుల వ్యవధిలో లక్షల విలువైన సామగ్రి చోరీ

మేడికొండూరు, జూన్ 19: మండల పరిధిలోని గుంటూరు బ్రాంచి కాలువతో పాటు దాని అనుబంధ కాలువల్లో నీటి ప్రవాహాన్ని క్రమబద్ధీకరించేందుకు ఏర్పాటు చేసిన షట్టర్లు, గేర్ బాక్సులు, స్క్రూ రాడ్స్ వంటి ఇనుప సామాన్లను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోతున్నారు. గడిచిన పది రోజులు వ్యవధిలో లక్షల విలువైన సామగ్రి చోరుల పాలయ్యాయి. కేవలం పాత ఇనుము కోసం చోరీ చేస్తున్న దొంగలు షట్టర్లు బిగించి ఉన్న గోడలు, సిమెంట్ దిమ్మెలను ఇష్టారాజ్యంగా పగుల గొట్టి ఇనుప సామాను ఎత్తుకెళ్లిపోతున్నారు. వీటిని తిరిగి నిర్మించాలంటే భారీ వ్యయమవుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేసవి కాలం కావడంతో పాటు పొలాలన్ని ఖాళీ ఉండగా కాలువలో నీటి ప్రవాహం లేదు. దీనిని ఆసరాగా చేసుకొని దొంగలు రెచ్చిపోతున్నారు. రోజుకోచోట కాలువకు ఉన్న షట్టర్లు మాయమవుతున్నాయి. పది రోజల వ్యవధిలో గుంటూరు బ్రాంచి కాలువ పరిధిలో బీ1 మేజర్ షట్టర్, బండారుపల్లి మేజర్ కాలువ పరిధిలోని ఎల్ మేజర్ షట్టర్, అదే కాలువ పరిధిలోని డీ మైనర్ షట్టర్ మాయమయ్యాయి. షట్టర్లు బిగించి ఉన్న సిమెంట్ గోడలను పగుల గొట్టి షట్టర్లతో పాటు వాటికి సంబంధించిన గేర్ బాక్సులు, స్క్రూ రాడ్‌లు ఎత్తుకెళ్లిపోతున్నారు. కాలువ షట్టర్‌ల గోడలు పగుల గొట్టి ఉండడంతో గమనించిన రైతులు మంగళ, బుధవారాల్లో కెనాల్స్ అధికారులకు సమాచారం ఇచ్చారు. వాటిని పరిశీలించిన అధికారులు ఇది దొంగల పనేనని భావించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రైతుల ఆందోళన : సరైన మరమ్మతులు లేక ఇప్పటికే అస్తవ్యస్తంగా ఉన్న కాలువల్లోని గోడలు పగులు గొట్టి షట్టర్‌లు ఎత్తుకెళ్లడంపై పలువురు



కాలువ మీద ఉన్న బీ1 మైనర్ షట్టర్ పగుల గొట్టి ఎత్తుకెళ్లిన దొంగలు



బండారుపల్లి పరిధిలోని ఎల్ మేజర్ షట్టర్ పగులగొట్టి ఇనుప సామాను చోరీ

రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. షట్టర్లు లేకపోతే కాలువ చివరి భూముల రైతులకు నీరందే పరిస్థితి ఉండదు, కాలువలో నీరు విడుదల నాటికి పగులు గొట్టిన షట్టర్‌ల స్థానంలో తిరిగి కొత్త వాటిని ఏర్పాటు చేస్తేనే చివరి భూములకు నీరు అందే పరిస్థితి ఉంటుందని లేదంటే పంటలను కోల్పోవలసి ఉంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తవి ఏర్పాటు చేసినా వాటిని దొంగల భారి నుంచి ఎలా కాపాడాలా అని రైతులు మదన పడుతున్నారు. పోలీసు అధికారులు దృష్టి సారించి షట్టర్ దొంగల ఆట కట్టించాలని కాలువ పరిధిలోని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అమరావతి రైతులపై అక్రమ కేసులు ఎత్తివేసేందుకు చర్యలు తీసుకోవాలి

● సచివాలయంలో హోంమంత్రి అనితకు విన్నవించిన రైతులు

తుళ్లూరు, జూన్ 19: అమరావతిని బ్రహ్మాండంగా కడతానని పోయిన ఎన్నికల ముందు చెప్పిన జగన్‌రెడ్డి, అధికారం దక్కగానే మూడు రాజధానులని అమరావతి రాజధానికి 33వేల ఎకరాలిచ్చిన రైతులను మోసం చేశాడని రైతులు అన్నారు. అంతేగాక మూడు ముక్కలాట వద్దు అని శాంతియుతంగా ఉద్యమం చేస్తుంటే లాఠీ చార్జ్ చేయించి అక్రమ కేసులు తమ మీద బనాయించారని హోం మంత్రి వంగలపూడి అనితకు రాజధాని రైతులు బుధవారం సచివాలయంలో ఆమె కలసి వివరించారు. వెలగపూడి సచివాలయంలో అనిత బాధ్యతలు తీసుకున్నారు. రైతులు ఆకుపచ్చ రంగు శాలువా మెడలో వేసి రైతులు అభినందనలు తెలిపారు. నాడు నేను రాజధాని రైతు ధర్నా శిబిరాలకు వచ్చి పరిస్థితి తెలుసుకున్నారని సంఘీభావం కూడా తెలిపానని అనిత చెప్పారు. రైతుల మీద పెట్టిన కేసులను ఎత్తివే



సచివాలయంలో హోంమంత్రి అనితను కలిసిన రాజధాని రైతులు

యటానికి కృషి చేస్తానని ఆమె హామినిచ్చారు. రైతులు జొన్నలగడ్డ శంకర్, అనుమోలు శివలింగయ్య, జే నాగమల్లేశ్వరావు, నరసింహారావు తదితరులు హోం మంత్రి కలసిన వారిలో ఉన్నారు.

గుండాలపాడు పాఠశాలలో పాఠ్య పుస్తకాల పంపిణీ

ఫిరంగిపురం, జూన్ 19 : మండలంలోని గుండాలపాడు గ్రామంలో ఎంపీపీ పాఠశాలలో పుస్తకాలను సర్పంచ్ కాంధ్రు దాసయ్య విద్యార్థులకు పంపిణీ చేశారు. బుధవారం గ్రామంలోని పలు పాఠశాలల్లో సర్పంచ్ ప్రభుత్వం ఇచ్చిన అచ్చు పుస్తకాలను, బ్యాగ్‌లను పంపిణీ చేశారు. అంతేగాక వేములూరిపాడు గ్రామంలో కూడా తెలుగుదేశం పార్టీ నాయకులు పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆళ్ళ కృష్ణమూర్తి, కొల్లి వసంతరావు, కట్టా కోటేశ్వరరావు, మాజీ సర్పంచ్ బోడిపాటి వెంకయ్య, ఏసురత్నం, జ్యోతి, ప్రధానోపాధ్యాయులు, శ్రీనివాసరావు, ఆర్ రాజశేఖర్, తెలుగుదేశం పార్టీ నాయకులు కటికల రామకోటేశ్వరరావు, పచ్చల రత్నరాజు, జూలూరి గోపీ, కల్లూరి శివనాగేశ్వరరావు, తాటి శివనాగేశ్వరరావు, హమీద్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.



ఫిరంగిపురం మండలం గుండాలపాడు పాఠశాలలో పుస్తకాలను పంపిణీ చేస్తున్న సర్పంచ్ కాంధ్రు దాసయ్య

పెనుమూలిలో నేను బడికి పోతా..

దుగ్గిరాల, జూన్ 19: పెనుమూలిలోని ఎస్టీ కాలనీలో నేనుబడికిపోతా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. విద్యార్థుల ఇండ్లకు వెళ్లిన కాజ శ్రీని వాసరావు(ఎంఈవో-1), కాజ లక్ష్మీనారాయణ(ఎంఈవో-2)లు బడిఈడు పిల్ల లందరినీ బడిలో చేర్పించాలంటూ తల్లిదండ్రులను ఒప్పించి కొందరిని పాఠ శాలకు పంపేలా అవగాహన కల్పించారు. హెచ్ఎం పి.విజయలక్ష్మి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి

● ప్రత్తిపాడు, ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

గుంటూరు(తూర్పు), జూన్ 19: నియోజకవర్గంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని ప్రత్తిపాడు, ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. బుధవారం గుంటూరు రూరల్ మండలంలోని పెదపలకలూరు గ్రామంలో జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు, బూట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన విద్య కోసం అవసరమైతే సొంత నిధులతో ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రత్యేక ప్రణాళికతో పరీక్షలలో విజయం సాధించాలని వారికి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన సరుకుల నాణ్యతను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో డీవైఈవో, హెడ్ మాస్టర్ పొన్నగంటి శ్రీనివాస్, ఎన్డీఏ నాయకులు లక్ష్మారెడ్డి, కొమరిశెట్టి సాంబశివరావు, ఎర్రంశెట్టి వేణుగోపాల్, గింజుపల్లి వెంకటేశ్వరరావు, ఇమ్మడి లీలా మల్లేశ్వరరావు, గంధం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిలో పారిశుధ్య పనుల పరిశీలన

తాడేపల్లి టౌన్, జూన్ 19: ఎంటీఎంసీ నగరపాలక సంస్థ కమిషనర్ నిర్మల్‌కుమార్ తాడేపల్లి పట్టణంలోని కొత్తూరు, పద్మశాలిబజార్, నవోదయ కాలనీ, ఉండవల్లి పెనుమాక ఉండవల్లి సెంటర్ సచివాలయాల పరిధిలో ఆయా సచివాలయాలను సందర్శించి పారిశుధ్య పనులను పరిశీలించారు. అన్ని సచివాలయాల సెక్రటరీలు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని తగు నిర్దీత సమయానికి విధులకు హాజరుకావాలని ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎటువంటి అసౌకర్యం ఏర్పడకుండా రోడ్లు, వీధులు డ్రెయిన్లు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. రోడ్లపై ఎటువంటి ఆక్రమణలు జరక్కుండా ప్లానింగ్ సిబ్బంది క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించాలని రోడ్లపై అనధికారికంగా ఎటువంటి తాత్కాలిక నిర్మాణాలు, ఇసుక, కంకర ఇటుక, డబ్రిస్‌లను రోడ్డుపైకి వేయకుండా చూడాలని రోడ్లపై అక్రమంగా తోపుడు బళ్లు, బడ్డీకొట్లు ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉన్నతాధికారులు తనిఖీలకు వస్తారని రికార్డులను తగు రీతిలో సిద్ధంగా ఉంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. విధులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పఠన ఉపకరణాలు అందించిన ఉపాధ్యాయ దంపతులు

దుగ్గిరాల, జూన్ 19: పేరుకలపూడిలోని ఎంపీ ప్రాథమిక పాఠశాల (హెచ్‌సీ) విద్యార్థులకు పెదపాలెంకు చెందిన ఉపాధ్యాయుడు బుల్లా మరియదాసు, మేరీ గోల్డ్ దంపతులు, తన తండ్రి బుల్లా సుబ్బారావు జ్ఞాపకార్థం విద్యార్థులందరికీ నోటుపుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, ఇతర ఉపకరణాలు అందించారు. సహోపాధ్యాయులు ప్రదీప్, భూషణం, విద్యాకమిటీసభ్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

260 బస్తాల పసుపు విక్రయం

దుగ్గిరాల, జూన్ 19: స్థానిక పసుపు మార్కెట్ యార్డులో బుధవారం జరిగిన వేలంలో 250 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.12,000 గరిష్ఠధర రూ.14,100, మోడల్ ధర రూ.13,800 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.12,000, గరిష్ఠ ధర రూ.14,100, మోడల్‌ధర రూ. 13,800 పలికాయి.

జగన్‌పై భయంతోనే నాకు ఓటు వేయలేదు

● ప్రజలు బలంగా మార్పును కోరుకున్నారు: షర్మిల



అమరావతి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తాజాగా జరిగిన సార్వత్రిక ఎన్నికలు జగన్‌కు వ్యతిరేకంగా జరిగాయని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి వ్యాఖ్యానించారు. బుధవారం విజయవాడ ఆంధ్ర రత్న భవన్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు. 'కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి, సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి భయపడే నాకు ఓటు వేయలేదు. అందుకే ఓటమిపాలయ్యా. రాష్ట్రంలో జరిగిన ఎన్నికలు చాలా విచిత్రం. ఊహించని ఫలితాలు వచ్చాయి. మార్పు కావాలని ప్రజలు బలంగా నిర్ణయించుకున్నారు. ఈసారి ప్రజలు తమ ఓటుకు న్యాయం జరగాలని కోరుకున్నారు. ఒక్క ఓటు కూడా వృథా కావొద్దని ప్రజలు కోరుకున్నారు. అందుకే ఈసారి కాంగ్రెస్‌కు తగినన్ని ఓట్లు రాలేదు' అని షర్మిల అన్నారు. రాహుల్ గాంధీకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన ఆమె... రాహుల్‌ను ఫైటర్‌గా అభివర్ణించారు. ఎన్నికల్లో విజయం సాధించిన చంద్రబాబుకు షర్మిల శుభాకాంక్షలు తెలిపారు.

పోలవరం బాధ్యత కేంద్రానిదే

● నిర్వాసితుల పునరావాస ప్యాకేజీ 33,000 కోట్ల కోసం కేంద్రంపై ఒత్తిడి పెంచండి

● సీఎం చంద్రబాబుకు సీపీఐ రామకృష్ణ లేఖ

అమరావతి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): పోలవరం జాతీయ ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో అత్యంత కీలకమైన నిర్వాసితుల పునరావాస ప్యాకేజీకి సంబంధించిన రూ.33 వేల కోట్ల నిధులు వెంటనే విడుదల చేసేలా కేంద్రంపై ఒత్తిడి పెంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ప్రాజెక్టు నిర్మాణ కాలంలోనే నిర్వాసితులకు పునరావాసం కల్పించి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అందించాలని పేర్కొన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు బుధవారం ఆయన లేఖ రాశారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనతికాలంలోనే పోలవరం ప్రాజెక్టును సందర్శించి, అక్కడ చోటుచేసుకున్న లోపాలపై మాట్లాడటం అభినందనీయమని రామకృష్ణ ప్రశంసించారు.

నేడు బీజేపీ ప్రజాప్రతినిధులకు అభినందన సభ

అమరావతి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో గెలుపొందిన బీజేపీ ప్రజాప్రతినిధులకు గురువారం అభినందన సభ ఏర్పాటు చేశారు. విజయవాడలోని వెన్యూ కన్వెన్షన్‌లో సాయంత్రం 5 గంటలకు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో బీజేపీకి చెందిన ముగ్గురు ఎంపీలు, 8 మంది ఎమ్మెల్యేలను ఘనంగా సత్కరించనున్నారు. నరసాపురం నుంచి గెలుపొంది కేంద్ర మంత్రిగా ఇటీవల పదవీ బాధ్యతలు స్వీకరించిన భూపతిరాజు శ్రీనివాసవర్మకు గన్నవరం విమానాశ్రయంలో ఘనస్వాగతం పలికి.. అక్కడి నుంచి అభినందన సభావేదిక వరకు భారీ ర్యాలీ నిర్వహించేందుకు బీజేపీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

జగన్ పాలనలో ఆర్థిక విధ్వంసం: లంకా దినకర్

న్యూఢిల్లీ, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల జగన్ పాలనలో ఏపీలో ఆర్థిక విధ్వంసం జరిగిందని లంకా దినకర్ తెలిపారు. బుధవారం ఢిల్లీలో ఏపీ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. 'జగన్ పాలనలో రాష్ట్రం తేరుకోలేనంతగా ఆర్థిక విధ్వంసానికి గురైంది. అప్పుల్లో ప్రథమం, ఆస్తుల కల్పనలో అధమం, ఆదాయ సృష్టిలో శూన్యం అనే విధంగా జగన్ రాష్ట్రాన్ని తయారు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్ఆర్బీఎం పరిధిలో చేసిన అప్పులు రూ.5.50 లక్షల కోట్లు దాటాయి. మిగతా అప్పులు, రుణాలు కలిపి మరో రూ.7.50 లక్షల కోట్ల వరకూ ఉండే అవకాశం ఉంది. ఏపీ మొత్తం అప్పులు రూ.13 లక్షల కోట్లు ఉండొచ్చు. గత ప్రభుత్వంలో ఆర్థిక విధ్వంసాలకి చేయూతనిచ్చిన అధికారులను బదిలీపై బయటికి పంపకూడదు. రాష్ట్రంలో ఏ విధంగా ఆర్థిక నిర్వహణ జరిగిందో ఏ ఏ పద్దులు, ఏ ఏ ఖాతాలకు ఎలా మళ్లించారో తెలుసుకోవాల్సిన అవసరం ఉంది' అని దినకర్ అన్నారు. ఏపీ బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేశ్ నాయుడు మాట్లాడుతూ, జగన్ విలాసవంతంగా కట్టుకున్నది ప్రజా ప్యాలెస్ కాదని, పబ్లీ ప్యాలెస్ అని విమర్శించారు. దీనిపై కొత్త ప్రభుత్వం విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

కార్పొరేషన్లలో జగన్ సైన్యం!

(మొదటి పేజీ తరువాయి)

సిఫారసు చేస్తే చాలు.. అర్హతలతో నిమిత్తం లేకుండా భారీ జీతాలతో ఉద్యోగాలు ఇచ్చేశారు. వైసీపీ సామాజిక మాధ్యమ కార్యకర్తలు, సొంత మీడియా ఉద్యోగులు రాచమర్యాదలు అందుకున్నారు. డిజిటల్ కార్పొరేషన్, గ్రీన్ కార్పొరేషన్, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఏపీ ఫైబర్‌నెట్ కార్పొరేషన్, ఈ-ప్రగతి, రియల్ టైమ్ గుడ్ గవర్నెన్స్ సర్వీస్, ఏపీఎండీసీలలో వైసీపీ కార్యకర్తలను అధిక జీతాలకు నియమించారు. ఇవి చాలవన్నట్లు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పిస్తామంటూ ఆప్కోస్ పేరిట ఒక కార్పొరేషన్‌ను జగన్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కార్పొరేషన్‌కు సీఎంవో కేంద్రంగా సిఫారసులు నడిచాయి.

కార్పొరేషన్ల కార్యాలయాలకు తాళం

కార్పొరేషన్లలో వైసీపీ కార్యకర్తలు, సొంత మీడియా సంస్థల ప్రతినిధులకు పెద్దఎత్తున ఉపాధి కల్పించి, వారందరికీ ప్రతినెలా రూ.వేల కోట్ల ప్రజాధనాన్ని జీతభత్యాలుగా చెల్లిస్తున్న భారీ కుంభకోణం తాజాగా బయటపడింది. ఆ ఉద్యోగులను పార్టీ కార్యక్రమాలకు జగన్ వినియోగించుకున్న వైనం వెలుగుచూడటంతో నిరుద్యోగ యువతలో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. జగన్ కోసం పనిచేస్తున్నందుకు సంవత్సరాల తరబడి విధులకు రాకుండానే రూ.లక్షల్లో జీతభత్యాలను తీసుకుంటున్నట్లు బయటపడటంతో రాష్ట్ర ప్రజలు నివ్వెరపోతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నాటినుంచి కార్పొరేషన్ల కార్యకలాపాలు నిలిచిపోయాయి. కార్పొరేషన్ల కార్యాలయాలకు తాళాలు వేసి, ఒక్క కాగితమూ బయటకు రాకుండా పోలీసులు సీలు వేశారు. ఉద్యోగుల అక్రమ నియామకాలు, అడ్డగోలు చెల్లింపులపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందుకు సంబంధించి నివేదికలను ఇప్పటికే సిద్ధం చేయడంతో పాటు త్వరలోనే కార్యాచరణను అమలు చేసేందుకు సన్నద్ధమవుతోంది. తక్షణమే జగన్ సైన్యాన్ని తొలగించి ఇంటికి పంపకుంటే .. కూటమి ప్రభుత్వ మనుగడకే ముప్పు వాటిల్లుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

ఇంధనశాఖలో జగన్ సైన్యాధ్యక్షులు

రాష్ట్ర ఇంధన సంస్థల్లో జగన్ సైన్యాధ్యక్షులు ఇంకా కీలక పదవుల్లోనే కొనసాగుతున్నారు. రూ.లక్షలు జీతభత్యాలు తీసుకుంటూ, సకల సౌకర్యాలు అనుభవిస్తూ పెత్తనం చెలాయిస్తున్నారు. ఏపీ జెన్కోలో కోల్ విభాగం డైరెక్టర్‌గా నాలుగేళ్లుగా విధులు నిర్వహిస్తున్న ఆంథోనిరాజ్‌కు జగన్ తల్లి విజయలక్ష్మి సిఫారసు చేశారని విద్యుత్తుసౌధ వర్గాలు చెబుతున్నాయి. కాలపరిమితి ముగిసిన ఆయన్ను విధుల నుంచి తప్పించాల్సి ఉండగా, మరో ఆరునెలల పాటు ఓఎస్డీగా కొనసాగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. అదేవిధంగా ఎన్టీపీసీ నుంచి వచ్చిన థర్మల్ డైరెక్టర్ బాబ్జీకి మాజీ మంత్రి ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్(నాని) సిఫారసు చేశారని పేర్కొంటున్నారు. ప్రభుత్వం మారినా ఆయన ఇంకా కొనసాగుతున్నారు. జెన్కో కోల్ విభాగం ఓఎస్డీగా మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సన్నిహితుడు రఘునాథరెడ్డి విధులు నిర్వహిస్తున్నారు. ట్రాన్స్‌కో ఫైనాన్స్ డైరెక్టర్ వీరభద్రారెడ్డి కెనరా బ్యాంకులో జనరల్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ చేశారు. పెద్దిరెడ్డి సిఫారసుతో వీరభద్రారెడ్డిని ట్రాన్స్‌కో ఫైనాన్స్ డైరెక్టర్‌గా నియమించారని విద్యుత్తుసౌధ వర్గాలు వెల్లడిస్తున్నాయి. హైడల్ డైరెక్టర్‌గా ఎంవీవీ సత్యనారాయణ, హ్యూమన్ రీసోర్స్ డైరెక్టర్‌గా రఫీ, కోల్ విభాగం ఓఎస్డీగా సత్యనారాయణ విధులు నిర్వహిస్తున్నారు.

డిస్కమ్‌లలో సొంత మనుషుల హవా

విద్యుత్తు పంపిణీ సంస్థలకు గతంలో సీనియర్ ఐఏఎస్ అధికారులు సీఎండీలుగా బాధ్యతలు నిర్వహించేవారు. కానీ జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ విధానానికి స్వస్తి పలికారు. సీఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ఆయన బంధువు శివప్రసాదరెడ్డిని ఎస్పీడీసీఎల్ సీఎండీగా నియమించారు. ఆయన కాలపరిమితి ముగిశాక .. షిర్డీసాయి ఎలక్ట్రికల్స్ విశ్వేశ్వరరెడ్డి బంధువు పద్మాజనార్దనరెడ్డికి ఆ పోస్టు కట్టబెట్టారు. ఈపీడీసీఎల్ సీఎండీగా సంతోష్‌రావును నియమించారు. ఒకసారి రెన్యువల్ అనంతరం ఆయన స్థానంలో ఐఏఎస్ అధికారి పృథ్వీతేజ్‌ను తీసుకున్నారు. అంతలోనే సీపీడీసీఎల్ సీఎండీగా పద్మాజనార్దనరెడ్డిని, ఎస్పీడీసీఎల్ సీఎండీగా సంతోష్‌రావును నియమించారు. ఏటా వేలాది కోట్ల టర్నోవర్ కలిగిన డిస్కమ్‌లకు సొంత మనుషులను నియమించుకున్న జగన్ వారిని సర్వసైన్యాధ్యక్షులుగా కొనసాగించారు. అవసరం లేకున్నా షిర్డీసాయి నుంచి ట్రాన్స్‌ఫార్మర్లను పద్మాజనార్దనరెడ్డి, సంతోష్‌రావు అధిక ధరలకు కొనుగోలు చేశారంటూ ఆరోపణలు వచ్చాయి. తెలంగాణ కంటే రెట్టింపు ధరకు వీటిని కొనుగోలు చేయడంపై దర్యాప్తు నిర్వహించాలన్న డిమాండ్ వినిపించింది. ఇదే సమయంలో గృహాలకు, వ్యవసాయానికి విద్యుత్తు మీటర్లు బిగించేందుకు పిలిచిన టెండర్లపైనా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. అదానీ, షిర్డీసాయి సంస్థలకు విద్యుత్తు మీటర్ల కొనుగోలు ఆర్డర్లు ఇవ్వడంలో మతలబు జరిగిందన్న ఆరోపణలొచ్చాయి. ఉద్యోగుల నుంచి కూడా తీవ్ర వ్యతిరేకత రావడంతో పద్మాజనార్దనరెడ్డిని తప్పించారు. దీంతో ఎస్పీడీసీఎల్‌తో పాటు సీపీడీసీఎల్ బాధ్యతలను కూడా సంతోష్‌రావు నిర్వహిస్తున్నారు. ఈపీడీసీఎల్ డైరెక్టర్‌గా మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం బంధువు సూర్యప్రతాప్ బాధ్యతల్లో ఉన్నారు. మరోవైపు రాష్ట్ర సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా జగన్ సీఎంవో ముఖ్యకార్యదర్శిగా పనిచేసిన ధనుంజయ రెడ్డి బంధువు మురళీకృష్ణరెడ్డి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అయితే తమకు ఎలాంటి బంధుత్వం లేదని ఆయన చెప్పుకుంటున్నారు. వాస్తవంగా ఆయన హోదా అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీరు(ఏడీఈ) కానీ ఆయనకు చీఫ్ ఇంజనీరు హోదాలో సీవోవోగా బాధ్యతలు అప్పగించారు. జీతభత్యాలు ఏడీఈ స్థాయిలోనే ఇస్తున్నా సీవోవో స్థాయిలో అధికారాలు కల్పించడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ కూడా మురళీకృష్ణారెడ్డికి సీవోవో బాధ్యతలు అప్పగించడంపై అభ్యంతరం తెలిపినట్లు విద్యుత్తు సౌధ వర్గాలు పేర్కొంటున్నాయి.

జగన్ నిర్లక్ష్యం వల్లే పోలవరం పూర్తికాలేదు

● యుద్ధప్రాతిపదికన పూర్తిచేసే బాధ్యత ఎన్డీయే ప్రభుత్వానిదే

● విశాఖ స్టీల్ ప్రైవేటీకరణ ఇప్పట్లో జరగదు

● కావాలనే దీనిపై రాద్ధాంతం: కిషన్‌రెడ్డి

● 'ఆంధ్రజ్యోతి'కి కేంద్ర మంత్రి ఇంటర్వ్యూ



న్యూఢిల్లీ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నిర్లక్ష్యం వల్లే పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో జాప్యం జరిగిందని కేంద్ర బొగ్గు గనుల మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. దానిని యుద్ధ ప్రాతిపదిక పూర్తిచేసే బాధ్యత ఎన్డీయే ప్రభుత్వానిదని భరోసా ఇచ్చారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ ఇప్పట్లో జరగదన్నారు. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత బుధవారం తొలిసారిగా ఢిల్లీలోని తన కార్యాలయంలో 'ఆంధ్రజ్యోతి'కి ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు. విశాఖ ఉక్కు రేపో ఎల్లుండో ప్రైవేటుపరం అవుతుందనేది అసత్య ప్రచారమేనని.. కొందరు కావాలనే రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రైవేటీకరణకు సంబంధించిన ఫైలే ఇంకా ముందుకు కదల్లేదన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారానికి క్యాప్టివ్ మైన్స్ అవసరమని, దీని గురించి చర్చించి సరైన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. సింగరేణి ప్రైవేటీకరణ అనేది కూడా పచ్చి అబద్ధమన్నారు. ఇదంతా కేసీఆర్ ఆడిన నాటకమని ఆరోపించారు. గత పదేళ్లలో దేశంలో ఒక్క బొగ్గు గనినైనా ప్రైవేటీకరించామా అని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎన్నికల్లో అద్భుతమైన తీర్పు ఇచ్చారని, వారి నమ్మకాన్ని చంద్రబాబు ప్రభుత్వం నిలబెడుతుందని చెప్పారు.

డిస్టిలరీ యాజమాన్యాల్లో కలకలం

హైదరాబాద్‌లో అసోసియేషన్ సమావేశం

● వైసీపీ హయాంలో తమకు ఆర్డర్లు దక్కని ఏడు కంపెనీల యాజమాన్యాలు దూరం

● కమీషన్లు వసూలు చేసిన ఇద్దరికి గుండెల్లో రైళ్లు

● సీఐడీ కేసు నేపథ్యంలో తమనితాము రక్షించుకునే యత్నాలు

అమరావతి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో జరిగిన మద్యం కుంభకోణం వెలుగులోకి రావడంతో డిస్టిలరీల యాజమాన్యాల్లో కలకలం మొదలైంది. గత ప్రభుత్వంలో కొన్ని డిస్టిలరీల ప్రతినిధులు వసూళ్ల వ్యవహారంలో భాగస్వాములయ్యారు. దీంతో ఇప్పుడు ఇది ఎవరికి చుట్టుకుంటుందోనని బెంబేలెత్తుతున్నారు. దీంతో హడావిడిగా హైదరాబాద్‌లో డిస్టిలరీల అసోసియేషన్ పేరుతో వారం రోజుల కిందట సమావేశం నిర్వహించారు. ఎప్పుడో రిజిస్ట్రేషన్ చేసుకున్న ఈ అసోసియేషన్ చాలాకాలం నుంచి నిర్లిప్తంగా ఉంది. ఇప్పుడు సీఐడీ విచారణ నేపథ్యంలో అసోసియేషన్‌ను మళ్లీ క్రియాశీలకం చేసి, తమను తాము రక్షించుకోవాలని కొందరు భావిస్తున్నారు. ఈ సమావేశానికి ఏడు డిస్టిలరీల యాజమాన్యాలు గైర్హాజరయ్యాయి. 'వైసీపీ ప్రభుత్వం హయాంలో మాకు మద్యం ఆర్డర్లు ఇవ్వలేదు. అలాంటప్పుడు ఈ అసోసియేషన్లతో మాకు ఏం అవసరం ఉంది? వైసీపీ ప్రభుత్వంతో అంటకాగిన వారిపై ఏవైనా చర్యలు తీసుకున్నా మాకు సంబంధం లేదు' అంటూ ఆ ఏడు డిస్టిలరీలు తెగేసి చెప్పాయి. ఈ సమావేశం ఏర్పాటు చేసిన వారిలో ఇద్దరు గత ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించారు. ఒకరు వైసీపీ తరఫున కమీషన్ వసూలులో కీలకంగా ఉన్నారు. మరొకరు మద్యం ఉత్పత్తికి ఉపయోగించే ఈఎన్ఏ సరఫరాలో లీటరుకు రూపాయి చొప్పున ముడుపులు వసూలు చేసిన వారిలో ఉన్నారు. రాష్ట్రంలో అయితే రూపాయి, ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తే లీటరు రూ.రెండు చొప్పున వసూలు చేసి పార్టీ నేతలు, అధికారులకు ఇచ్చారు. కొత్తగా ఎవరైనా మద్యం వ్యాపారం చేయాలని ఎక్సైజ్ శాఖను సంప్రదించినా వారి వద్దకే వెళ్లమనే స్థాయిలో చక్రం తిప్పారు. దీంతో ఇప్పుడు విచారణలో వీరూ ఉండొచ్చన్న ప్రచారం జరుగుతోంది. కాగా కమీషన్లు ఇచ్చిన మద్యం కంపెనీలకు కూడా ఇబ్బందులు తలెత్తే పరిస్థితి కనిపిస్తోంది. ఎందుకంటే వైసీపీ పెద్దలకు కమీషన్లు ఇవ్వడం కోసం ఆయా కంపెనీలకు ఇచ్చే ధరలను ఏపీ ప్రభుత్వం పెంచింది. ఒకే బ్రాండ్‌కు పక్క రాష్ట్రాల ప్రభుత్వాలు తక్కువ ధర చెల్లిస్తే, ఏపీ ప్రభుత్వం ఎక్కువ చెల్లించింది. అయితే దీనిని సాంకేతికంగా అధిగమించేందుకు ఆయా కంపెనీలు బ్రాండ్ల పేర్లలో స్వల్ప మార్పులు చేసి వాటిని ఏపీ ప్రభుత్వానికి ఇచ్చినట్లు అధికారులు భావిస్తున్నారు. ఉదాహరణకు ఒక పాపులర్ బ్రాండ్ పేరు అందరికీ తెలిసినా దానికి చివర్లో ప్రీమియం, డీలక్స్ లాంటి పేర్లను కనిపించీ కనిపించకుండా చేర్చి వాటిని కొత్త బ్రాండ్లుగా చూపే ప్రయత్నం చేశారు. ఇవన్నీ ఇప్పుడు విచారణలో బయటపడే సమయం రావడంతో డిస్టిలరీలు, కంపెనీల యాజమాన్యాల్లో ఆందోళన పెరిగింది.



ఏరువాక సాగారో..

రాష్ట్రంలో ఖరీఫ్ సాగు ఆరంభం

● ఆశాజనకంగా నైరుతి వర్షపాతం

● వాన పడిన చోట విత్తనం

● దుక్కులు దున్ని మెట్ట పైర్లు

● 2,3 రోజుల్లో పూర్తిస్థాయిలో సాగు పనులు

అమరావతి, జూన్19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఖరీఫ్ సాగు మొదలైంది. నైరుతీ రుతుపవనాలు, ఉపరితల ఆవర్తనాల ప్రభావంతో వివిధ జిల్లాల్లో గత రెండు వారాలుగా తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు పడుతున్నాయి. అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నెల ఒకటి నుంచి ఇప్పటి వరకు నాలుగైదుజిల్లాల్లో వాన లోటున్నా, రాష్ట్రవ్యాప్తంగా 50.5% అధికంగానే వర్షపాతం నమోదైంది. శ్రీకాకుళం, మన్యం, అల్లూరి, తూర్పుగోదావరి జిల్లాల్లో వర్షాలు తక్కువగా పడ్డాయి. కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, పల్నాడు జిల్లాల్లో సాధారణ స్థాయిలో వాన పడింది. విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కృష్ణా, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో సాధారణం కన్నా అదనంగా వర్షాలు పడ్డాయి. ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో సాధారణం కన్నా 50%పైగా అధిక వర్షాలు కురిసినట్లు ప్రభుత్వ గణాంక విభాగం తెలిపింది. ఈ తొలకరి వర్షాలతో మెట్ట రైతులు పొలాలు దుక్కులు దున్ని, పచ్చిరొట్ట ఎరువుకు ఉపయోగపడే పిల్లిపెసర, జనుము, జీలుగ వంటి పైర్లు వేస్తున్నారు. వాన ఎక్కువగా పడినచోట నేల పదునైతే.. పత్తి, అపరాలు, నూనె గింజల పంటలు వేస్తున్నారు. కృష్ణా, గోదావరి డెల్టాలో వరి సాగు కోసం ఇప్పుడిప్పుడే నారుమళ్లు పోస్తున్నారు. కృష్ణా, వంశధార, నాగావళి, పెన్నా ఆయకట్ల కింద వరి సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఎగువన వర్షాలు బాగా కురిసి, శ్రీశైలం, పులిచింతల, ప్రకాశం బ్యారేజీకి వరద నీరు వస్తే.. కృష్ణా డెల్టాకు నీటి విడుదల చేపడతామని అధికారులు అంటున్నారు. మరోవైపు రుతుపవనాలు పూర్తిగా బలపడ్డాక మెట్ట పంటల సాగు పుంజుకునే అవకాశముంది. ఈనెల 22న ఏరువాక పౌర్ణమి నుంచి రైతులు వ్యవసాయ పనులను ముమ్మరం చేయనున్నారు. ఈ ఖరీఫ్‌లో అపరాలు, మిర్చి, పసుపు, వేరుశనగ పంటలకు మార్కెట్‌లో మంచి ధరలు లభిస్తాయని ఎన్జీ రంగా యూనివర్సిటీ వ్యవసాయ మార్కెట్ ఇంటెలిజెన్స్ కేంద్రం అంచనా వేసింది.

ఐదేళ్లు అతలాకుతలం!

విత్తనం నుంచి విక్రయం వరకు రైతును చేయిపట్టుకుని నడిపిస్తామని చెప్పిన జగన్ ప్రభుత్వం గత ఐదేళ్ల పాలనలో సాగు రంగాన్ని కుదేలు చేసింది. వరుస విపత్తులతో కర్షకులు తీవ్రంగా నష్టపోయి, అప్పుల పాలై, వందలాది మంది బలవన్మరణాలు పాల్పడినా.. అరకొరగా పెట్టుబడి సాయంతో చేతులు దులుపుకొంది. కష్ట సమయంలో అండగా ఉండాల్సిందిపోయి.. రైతులకు మేలు చేసే రాయితీ పథకాలకు స్వస్తి పలికింది. గతంలో టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన అనేక పథకాలను రద్దు చేయడంతో పాటు కేంద్ర ప్రయోజిత పథకాలను వినియోగించుకోవడంలో తీవ్ర నిర్లక్ష్యం చేసింది. రాష్ట్రంలో వ్యవసాయ రంగం సంక్షోభంలోకి నెట్టేసింది.



● జగన్ పాలనలో సాగురంగం తీసికట్టు

● వరుస విపత్తులతో కర్షకులకు కష్టనష్టాలు

● రాయితీ పథకాల రద్దుతో రైతులు కుదేలు

● పెట్టుబడి సాయం అరకొరగా ఇచ్చి అన్యాయం

● దిగజారిన పాడి, మత్స్యకార, ఉద్యానరంగాలు

● మార్కెటింగ్‌శాఖ నిర్వీర్యం.. రైతుకందని సాయం

● మద్దతు ధర లేదు.. ధరల స్థిరీకరణ నిధీ లేదు

● ఇతర అనుబంధ రంగాలదీ అదే దుస్థితి

● రబీ కొనుగోళ్లపై ఇప్పటికీ 1600 కోట్ల బకాయి

● బాబు రాకతో అన్నదాతల్లో కోటి ఆశలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ఐదేళ్ల పాలనలో వ్యవసాయం తీసికట్టుగా తయారైంది. రైతులకు ఏ రకంగానూ వైసీపీ మేలు చేయలేకపోయింది. ఆఖరికి రైతుభరోసా కింద ఏటా రూ.13,500 ఇస్తామని చెప్పిన జగన్ సర్కార్... కేవలం రూ.7,500లే రైతుల చేతుల్లో పెట్టింది. కౌలురైతులకూ, అగ్రవర్ణ సాగుదారులకు పెట్టుబడి సాయం చేస్తామని చెప్పి ఎగనామం పెట్టింది. వ్యవసాయశాఖలో రాయితీ పథకాలకు స్వస్తి చెప్పడమే కాదు.. రబీ పంటలకు బీమా కూడా అమలు చేయలేదు. గత ఖరీఫ్ రైతులకు బీమా కూడా చెల్లించాల్సి ఉంది. రబీలో కరువు వల్ల నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాల్సి ఉంది. విపత్తులకు పంట నష్టపోతే.. పాత జీవో ప్రకారం అరకొరగా ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చి చేతులు దులుపుకున్న పరిస్థితి. రూ.లక్షలోపు రుణాలపై ఏడాది లోపు వడ్డీతో సహా వసూలు చేసి, కొన్నాళ్ల తర్వాత వడ్డీ రీయింబర్స్‌మెంట్ చేసేది. గతంలో రూ.లక్ష నుంచి రూ.3లక్షల వరకు పావలా వడ్డీకి ఇచ్చిన రుణాలను నిలిపివేసింది. కేంద్రం కొంత వడ్డీ భరిస్తున్నా.. పావలా వడ్డీ పథకాన్ని ఎత్తేసింది. ఫలితంగా కౌలురైతులు ప్రైవేటు వ్యక్తుల నుంచి అధిక వడ్డీలకు అప్పులు చేసి, సాగు నష్టాలతో బాకీలు తీరక బలవన్మరణాలకు పాల్పడిన ఉదంతాలు కోకొల్లలు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల వ్యాపారుల నుంచి లైసెన్సు ఫీజులు వసూలు చేస్తూనే.. వారి టర్నోవర్‌కు తగ్గ సరుకు కేటాయించకుండా, ఆర్బీకేల్లో విక్రయించి, డీలర్లను దెబ్బతీసింది. ఉద్యాన తోటల విస్తరణ కోసం కేంద్రం సహాయం చేసే మైక్రో, డ్రిప్ ఇరిగేషన్ పథకాన్ని జగన్ సర్కార్ నిర్వీర్యం చేసింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీఎస్టీ రైతులతో పాటు ముఖ్యంగా రాయలసీమ, ఉత్తరాంధ్ర రైతులు రాయితీలు కోల్పోయి, సొంత డబ్బుతో సూక్ష్మసేద్య పరికరాలు కొనుక్కోవాల్సి వచ్చింది. గతంలో ఈ పరికరాలు సరఫరా చేసిన కంపెనీలకు బకాయిలు చెల్లింపులోనూ తీవ్ర జాప్యం చేసింది. ఫలితంగా ఉద్యాన తోట విస్తరణ కుంటుపడింది. రాయలసీమను ఉద్యాన హబ్‌గా మార్చాలన్న చంద్రబాబు ఆలోచనకు జగన్ సర్కార్ గండికొట్టింది. పట్టు పరిశ్రమకు అసలే అరకొరగా నిధులిచ్చి, రైతులకు రాయితీలు వర్తింపజేయకుండా ఇబ్బంది పెట్టింది. మార్కెటింగ్‌శాఖ ద్వారా ప్రభుత్వ మద్దతు ధరలకు పంట ఉత్పత్తులను కొనుగోలు చేయడానికి ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేస్తామని.. అరకొరగా కూడా సేకరించలేకపోయింది. ఏటా ధాన్య సేకరణ లక్ష్యం మేరకు కొనుగోలు చేయకుండా, రైతులకు సొమ్ము సకాలంలో చెల్లింపులు జరపకుండా ఇబ్బంది పెట్టింది. ఇటీవల రబీ ధాన్యం కొనుగోలుకు సంబంధించి, ఇప్పటికీ రూ.1,600కోట్లపైగా చెల్లించాల్సి ఉంది.

మత్స్యకారులకూ అంతే!

మత్స్యశాఖ ద్వారా మత్స్యకారులకు రాయితీపై పడవలు, వలలు, ఇతర వేట సామగ్రిని ఇవ్వకుండా, వేట నిషేధ సమయంలో మత్స్యకార భరోసా పేరుతో చేతులు దులుపుకొంటోంది. పెద్ద జలాశయాల్లో మత్స్యకార సంఘాల సభ్యుల చేపల పెంపకానికి గండికొట్టి, వేలం విధానాన్ని తెచ్చింది. ఆక్వా సాగును జోన్లుగా విభజించి, నాన్ జోన్ రైతులకు విద్యుత్ రాయితీకి కత్తెరేసింది. కోవిడ్ సమయం నుంచి చేపలు, రొయ్యల ఎగుమతులు మందగించి, గిట్టుబాటు ధర రాక డోర్‌డెలివరీలు చేసుకునే స్థితి వచ్చింది. విత్తన, దాణా చట్టాలను మార్చి ఆక్వా, పశువైద్య రంగాన్ని ఆంక్షల్లోకి నెట్టింది.

అన్నీ అటకెక్కించేశారు!

నియోజకవర్గానికో మార్కెట్ పేరుతో యార్డుల సంఖ్యను పెంచినా అధికార పార్టీ నేతలకు పదవులివ్వడం తప్ప.. వైసీపీ ప్రభుత్వం రైతుకు ఒరగబెట్టిందేమీ లేదు. ధాన్యం, ఆక్వా ఉత్పత్తులపై మార్కెట్ సెస్ పెంచి, అదనపు సొమ్ముపై రుణం తెచ్చి, గ్రామీణ రోడ్లు వేస్తామని చెప్పి, ఏ రోడ్లూ వేయలేదు. నాబార్డు నిధులతో చేపట్టిన అగ్రి ఇన్‌ఫ్రా పనులు సగం కూడా పూర్తి కాలేదు. రైతుబజార్లలో అస్తవ్యస్తంగా దుకాణాలు ఏర్పాటు చేసి, అద్దెలు భారీగా పెంచేసినా.. సిబ్బందికి మాత్రం కనీస వేతనాలివ్వడం లేదు. మొబైల్ రైతుబజార్లకు స్వస్తి చెప్పారు. పశుసంవర్ధకశాఖలో గతంలో ఉన్న మినీ గోకులాలు, రాయితీపై పశుదాణా, పశుగ్రాస క్షేత్రాల వంటివి అటకెక్కించింది. గోపాలమిత్రల సేవలను గుర్తించకుండా, సంచార పశువైద్యం ముసుగులో గ్రామీణ పశువైద్యాన్ని నిర్వీర్యం చేసింది.

అంతా సొంత లాభమే!

రాష్ట్రంలోని సహకార సంఘాలకు ఐదేళ్లలో ఎన్నికలు నిర్వహించలేకపోయింది. పీఏసీఎస్, డీసీసీబీ, డీసీఎంఎస్, ఆప్కాబ్, మార్క్‌ఫెడ్ వంటి సంస్థల పగ్గాలను నామినేటెడ్ పద్ధతిలో సొంత పార్టీ నేతలకు అప్పగించడంతో ఆయా సంస్థల్లో చాలా మంది అందిన ప్రభుత్వ ధనాన్ని దోచేశారు. వాటిపై విచారణ, చర్యలు కాగితాలకే పరిమితమయ్యాయి. ఉద్యాన విశ్వవిద్యాలయ వీసీ నియామకంలో నిబంధనలు పాటించకుండా, రెండోసారి వీసీని కొనసాగించడంతో కోర్టులో వ్యాజ్యం దాఖలైంది. ఉద్యాన వర్సిటీ వీసీ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వ్యవసాయ, పశువైద్య, మత్స్య విశ్వవిద్యాలయాలకు ఇన్‌చార్జి వీసీలతో నెట్టుకొస్తున్నారు. సెర్చ్ కమిటీలతో రెగ్యులర్ వీసీలను నియమించాల్సి ఉంది. ఈ నాలుగు వర్సిటీల్లో అనేక అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపణలున్నాయి. సిబ్బందికి కనీసం జీతాలు కూడా నెలనెలా ఇవ్వని దుస్థితి నెలకుంది. ఈ నేపథ్యంలో వ్యవసాయ, ఉద్యాన, సహకార, మార్కెటింగ్, పాడిపరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక, మత్స్యశాఖ అధికారులంతా రైతులకు అందుబాటులో ఉండాలని ఈ శాఖల మంత్రి అచ్చెన్నాయుడు ఉన్నతాధికారులకు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. దీంతో కూటమి ప్రభుత్వంలో సాగురంగంతోపాటు, అనుబంధ రంగాలకు మంచి రోజులు వచ్చినట్లేనని రైతాంగం భావిస్తోంది.



గుండెమార్పిడి చేయించుకున్న వెంకటేశ్ దంపతులతో ఆస్టర్ వైద్య బృందం

ఐటీ ఉద్యోగికి రెండుసార్లు గుండెమార్పిడి

▸▸ విజయవంతంగా నిర్వహించిన బెంగళూరులో ఆస్టర్ వైద్యులు

బెంగళూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): బెంగళూరు ఆస్టర్ ఆసుపత్రి వైద్యులు ఓ ఐటీ ఉద్యోగికి రెండుసార్లు గుండె మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. 2023 డిసెంబరు 31న రెండోసారి గుండె మార్పిడి ఆపరేషన్ చేయించుకున్న ఐటీ ఉద్యోగి వెంకటేశ్ సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారని వైద్య నిపుణులు నాగమల్లేశ్ ప్రకటించారు. బెంగళూరు నగరంలో బుధవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ఐటీ ఉద్యోగిని మీడియాకు పరిచయం చేశారు. వైద్యులు నాగమల్లేశ్, దివాకర్ భట్ మాట్లాడుతూ, '2016లో ఐటీ ఉద్యోగికి డైలేటెడ్ కార్డియోమయోపతి లక్షణాలు కనిపించాయి. పలు ఆసుపత్రులు సందర్శించి, చివరకు ఆస్టర్ ఆసుపత్రికి వచ్చారు. ఆయనకు గుండెమార్పిడి సర్జరీ చేశాం. ఆ తరువాత పూర్తిగా కోలుకుని సాధారణ జీవనం సాగించారు. 2018లో వివాహం చేసుకున్నారు. 2020లో కొవిడ్ సోకి ఇంటెన్సివ్‌కేర్‌లో చికిత్స పొందారు. 2023లో మరోసారి గుండె సమస్య తలెత్తింది. రక్తస్రావంతోపాటు ఇతరత్రా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వైద్య పరీక్షల ద్వారా గుండెమార్పిడి తప్పనిసరని నిర్ధారించాం. గత ఏడాది డిసెంబరు చివరి వారంలో ఆయన అడ్మిట్ అయ్యారు. విజయవంతంగా గుండె మార్పిడి శస్త్ర చికిత్సను పూర్తి చేశాం. దేశంలో రెండుసార్లు గుండె మార్పిడి చేయించుకున్న వారిలో వెంకటేశ్ రెండోవారు. కర్ణాటకకు చెందిన వారు తొలి వ్యక్తి' అని వివరించారు. వెంకటేశ్ మీడియాతో మాట్లాడుతూ, 'తొలిసారి గుండె జబ్బును వారం రోజుల్లోనే తెలుసుకున్నా. అప్పుడు గుండె మార్పిడికి నాటి ఏపీ ప్రభుత్వం ద్వారా అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు సీఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా రూ.7 లక్షలు సాయం చేశారు. రెండోసారి ఆపరేషన్‌కు రూ.10 లక్షలకు దరఖాస్తు చేసుకున్నాం. ఇంకా నిధులు విడుదల కాలేదు. రెండోసారి ఆపరేషన్‌తో కొన్ని ఇబ్బందులు వచ్చాయి. ప్రస్తుతం ఆరోగ్యంగా ఉన్నా' అని తెలిపారు. సమావేశంలో వైద్యులు గణేశ్ కృష్ణన్, మధుసూదన్ నారాయణ్, ప్రశాంత్, సీఈఓ రమేశ్ కుమార్ పాల్గొన్నారు.

ఫిలిప్పీన్స్ వెళ్లి ఆరేళ్లు..

▸▸ అప్పటి నుంచి ఆచూకీ గల్లంతు.. గుర్తించిన సంగారెడ్డి పోలీసులు

▸▸ కొడుకుతో ఫోన్‌లో మాట్లాడిన తల్లి

సంగారెడ్డి క్రైం, జూన్ 19 : అతను ఎంబీబీఎస్ చదివేందుకు ఫిలిప్పీన్స్ వెళ్లాడు. తండ్రి మరణించిన సమయంలో ఓసారి ఇంటికి వచ్చి వెళ్లాడు. ఆ తర్వాత ఆరేళ్లగా అతని ఆచూకీ లేదు. తల్లి ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా, సంగారెడ్డి పోలీసులు అతని ఆచూకీ కనుగొని, తల్లితో ఫోన్‌లో మాట్లాడించారు. సంగారెడ్డి జిల్లా ఎస్పీ చెన్నూరు రూపేష్ ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సంగారెడ్డి జిల్లా కంది మండల కేంద్రానికి చెందిన సత్యగామ మాణమ్మ కుమారుడు అరుణ్‌రెడ్డి (31) 2012లో ఎంబీబీఎస్ చదవడానికి ఫిలిప్పీన్స్ దేశానికి వెళ్లాడు. 2018లో తండ్రి వెంకట్‌రాంరెడ్డి మరణం అనంతరం ఇంటికి వచ్చి, అదే సంవత్సరం తిరిగి ఫిలిప్పీన్స్ దేశానికి వెళ్లాడు. ఆరు ఏళ్లు అయినా ఇంటికి రాకపోవడం, కనీసం ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో తన బిడ్డ ఆచూకీ కోసం తల్లి మణమ్మ కన్నీరుమున్నీరైంది. చివరికి ఈ నెల 10న జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసింది. స్పందించిన జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ ఐటీ సెల్ ఇన్‌స్పెక్టర్‌కు అతని ఆచూకీ తెలుసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. అరుణ్‌రెడ్డి పాస్‌పోర్టు, ఫోన్ నంబరు, ఫోటోలు తదితర విషయాలన్నీ తెలుసుకొని ఫిలిప్పీన్స్ ఎంబసీతో మాట్లాడారు. అరుణ్‌రెడ్డి ఫోన్ నంబర్‌ను ట్రేస్ చేసి తన తల్లి మాణమ్మతో మాట్లాడించారు. తన కుమారుడు ఆరేళ్లుగా ఏమయ్యాడో అని ఆందోళన చెందుతున్న మాణమ్మకు కన్నకొడుకు ఫోన్ చేయడంతో ఒక్కసారిగా ఆమె సంతోషానికి అవధులు లేకుండాపోయాయి. తన కుమారుడి జాడ తెలుసుకొని తనతో ఫోన్‌లో మాట్లాడించిన జిల్లా ఎస్పీ రూపేష్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. అయితే, ఫిలిప్పీన్స్ దేశంలో అరుణ్‌రెడ్డి పాస్‌పోర్టు, ఇతర ధ్రువపత్రాలు పోగొట్టుకున్నాడని, భయాందోళన కారణంగా తల్లికి ఫోన్ చేయలేకపోయాడని జిల్లా ఎస్పీ రూపేష్ తెలిపారు.

సంగం డెయిరీ వరి విత్తనాలు సిద్ధం

చేబ్రోలు, జూన్ 19: సంగం డెయిరీ విత్తన పరిశోధన అభివృద్ధి విభాగం ఆధ్వర్యంలో బీపీటీ వరి విత్తనాలు, ఎంటీయూ వరి విత్తనాలు రైతులకు అందచేయటానికి సిద్ధంగా ఉన్నట్లు వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ అల్లపాటి సత్యనారాయణ బుధవారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థ ధ్రువీకరణ పొంది ఉత్పత్తి చేయబడిన బీపీటీ 5204, ఎంటీయూ 1224 రకాలకు చెందిన వరి విత్తనాలు 25 కిలోలు రూ. 1125 ధరగా తెలిపారు. సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ పర్యవేక్షణలో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. విత్తనాలు కావలసిన రైతులు 9398423590 నంబరును సంప్రదించాల్సిందిగా సూచించారు.



పట్టణంలో ఆక్రమణలు తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు

పట్టణంలో ఆక్రమణల తొలగింపు

తెనాలి, మారీసుపేట జూన్ 19: పట్టణంలో రహదారులపై ఆక్రమణల తిలగింపు కార్యక్రమానికి మున్సిపల్ ఆధికారులు శ్రీకారం చుట్టారు. బుధవారం పట్టణ పురపాలక సంఘ కార్యాలయం వద్ద ఉన్న మహాత్మాగాంధీ పురపాలక కూరగాయల మార్కెట్ సముదాయం వద్ద రహదారులపై ఆక్రమణలను మున్సిపల్ అధికారులు తొలగించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పోలీసులు, మున్సిపల్ అధికారలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



హోంమంత్రి అనితను అభినందిస్తున్న జిల్లా పార్లమెంటరీ తెలుగు మహిళా అధ్యక్షురాలు జయలక్ష్మి, శ్రావణ్‌కుమార్ తదితరులు

హోంమంత్రి అనితకు అభినందనలు

తెనాలి, మారీసుపేట జూన్ 19: రాష్ట్ర హోంమంత్రి, విపత్తుల నిర్వహణ మంత్రిగా సచివాలయంలో బాధ్యతలు స్వీకరించిన వంగలపూడి అనితను జిల్లా పార్లమెంటరీ తెలుగు మహిళా అధ్యక్షురాలు అన్నాబత్తుని జయలక్ష్మి, శ్రావణ్‌కుమార్‌లు కలసి శుభానందనలు తెలిపారు. బుధవారం వెలగపూడి సచివాలయంలో వంగలపూడి అనిత బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా పార్లమెంటరీ తెలుగు మహిళా అధ్యక్షురాలు అన్నాబత్తుని జయలక్ష్మి, శ్రావణ్‌కుమార్‌లను అన్నా, వదినలుగా పాదాభివందనం చేసి ఆశీస్సులు తీసుకున్నారు. కార్యక్రమంలో ఉప్పల అజయ్‌కుమార్, మంగమూరి యుగంధర్, బొలినేని చౌదరి, చుక్కపల్లి చినబాబు, బొలినేని బుజ్జి, కృష్ణ, రాము, బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య న్యాయ సలహా కమిటీ చైర్మన్‌గా మల్లికార్జురావు

తెనాలి, మారీసుపేట జూన్ 19: గుంటూరు జిల్లా ఆర్యవైశ్య న్యాయ సలహా కమిటీ చైర్మన్‌గా మద్ది మల్లికార్జురావును జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు పెండేల సుబ్బారావు నియమించారు. స్థానిక గంగానమ్మపేటలోని ఆర్యవైశ్య విద్యానిధి ప్రాంగణంలో బుధవారం జిల్లా ఆర్యవైశ్య న్యాయ సలహా కమిటీ చైర్మన్‌గా మద్ది మల్లికార్జురావును జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు పెండేల సుబ్బారావు నియమక పత్రాన్ని అందించారు. ఈ పదవీ కాలం రెండు సంవత్సరాలు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ మున్సిపల్ మాజీచైర్మన్ పెండేల వెంకట్రావు, తాతా శ్రీనివాసు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



పేద మహిళలకు చీరలను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు రవీంద్ర, జగన్, వెంకటేశ్వరరావు తదితరులు

పేద మహిళలకు చీరల పంపిణీ

తెనాలి, మారీసుపేట జూన్ 19: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు, పౌరసరఫర శాఖ మంత్రిగా నాదెండ్ల మనోహర్‌లు బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా టీడీపీ నాయకులు పేద మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక బోసురోడ్డులో టీడీపీ నాయకులు పినపాటి రవీంద్ర, ఎన్టీఆర్ జగన్, మైలా వెంకటేశ్వరావుల ఆధ్వర్యంలో ఈ చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థులతో కరస్పాండెంట్ శివకుమార్, ప్రిన్సిపాల్

ఏఎస్ఎన్ విద్యార్థులకు ఉద్యోగాలు

తెనాలి అర్బన్, జూన్ 19: ఏఎస్ఎన్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలో ఉద్యోగాలు లభించినట్లు మాజీ ఎమ్మెల్యే, కళాశాల కరస్పాండెంట్ అన్నాబత్తుని శివకుమార్ వెల్లడించారు. ఈ సందర్భంగా కళాశాలలో బుధవారం శివకుమార్ మాట్లాడుతూ, అంతర్జాతీయ కంపెనీకి 21మంది విద్యార్థులు ఎంపికయ్యారని చెప్పారు. కాలిఫోర్నియా కేంద్రంగా పనిచేస్తున్న ఏఐ టూల్స్ ఉపయోగించి సర్వీసు అందిస్తున్న ఏఐ సంస్థ ఈ నెల 13, 14 తేదీల్లో ప్రాంగణ ఎంపిక నిర్వహించింది. బీయస్సీ, బీకాం, బీసీఏ విద్యార్థులు ఎంపిక కాగా జూలై మూడోవారంలో బెంగుళూరులోని కంపెనీలో ఉద్యోగాల్లో చేరేందుకు ఎంపిక చేశారని చెప్పారు. తమ కళాశాలలో విద్యార్థులు స్వయం ఉపాధి సాధించేలా స్కిల్స్‌ను నేర్పుతున్నామన్నారు. ప్రతిఏటా ప్రాంగణ ఎంపికలో ఉద్యోగాలు సాధించేందుకు శిక్షణ, ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కొలసాని రాంచంద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్ జన్మదిన వేడుకలు

తెనాలి అర్బన్, జూన్ 19: అఖిల భారత కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. మారీసుపేట కాంగ్రెస్ కార్యాలయంలో నియోజకవర్గ పార్టీ కన్వీనర్ డాక్టర్ చందు సాంబశివుడు కేక్ కట్ చేసి కార్యకర్తల మధ్య వేడుకలు నిర్వహించారు. దేశంలో కాంగ్రెస్ పార్టీని మళ్లీ అధికారంలోకి తెచ్చేందుకు రాహుల్ గాంధీ కృషి చేస్తున్నారని చెప్పారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారానికి చేరువగా వచ్చిందన్నారు. జోడో యాత్ర ద్వారా దేశంలో కాంగ్రెస్‌పై ఆదరణ పెంచుతున్నారని చెప్పారు. ఆయన నాయకత్వంలో దేశంలో మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని చెప్పారు. పార్టీ నాయకులు పొన్నూరు శశి, ద్వారకా శీను, మల్లవరపు ప్రసాద్, స్టీవెన్‌బాబు, వెంకట్రావు, అయ్యప్ప, సుబ్బారావు, మాధవరావు, శివకుమార్ పాల్గొన్నారు.



కొల్లిపర సమీపంలో సాగులో ఉన్న బీర తోట, కళకళలాడుతున్న బెండ

మాగాణిలో కాయగూరల సాగు

నీటి వసతి ఉన్న భూముల్లో బీర, బెండ, దోస తోటలు

కొల్లిపర, జూన్ 19: మండు వేసవిలో రైతులు మాగాణి భూముల్లో కాయగూరల సాగుకు సమాయత్తమయ్యారు. ఇప్పటికే మొక్కజొన్న, జొన్న నూర్పిళ్లు పూర్తియిన భూముల్లో విత్తనాలు విత్తారు. అవి నేడు మొలకెత్తి మండు వేసవిలో సైతం పచ్చగా కళకళలాడుతున్నాయి. మాగాణి భూముల్లో బోర్ల వసతి కలిగిన రైతులు తక్కువ నీటి వినయోగం, తక్కువ ఖర్చుతో రాబడినిచ్చే కాయగూరల సాగువైపు మొగ్గు చూపుతున్నారు. కొల్లిపర మండలంలోని కొన్ని గ్రామాల్లో మాగాణి భూముల్లో వ్యవసాయ బోర్లు ఉన్నాయి. వాటిలో బోర్లకు విద్యుత్ సౌకర్యం ఉంది. దీంతో నీటి వసతి ఉన్న భూముల్లో సన్న, చిన్నకారు రైతులు కౌలుకు తీసుకుని అతి తక్కువ ఖర్చు, కొద్దిపాటి నీటి తడులతో ఎక్కువ దిగుబడిని ఇచ్చే బీర, బెండ, దోస తదితర కాయగూరల తోటల సాగుకు ఉపక్రమించారు. కొల్లిపర, దావులూరిపాలెం సమీపంలో బీర, దోస, అన్నవరం, అన్నవరంగౌడపాలెం ప్రాంతంలో దోస, బెండ తోటలను వేశారు. మండలంలో కొల్లిపర, బొమ్మువానిపాలెం, మున్నంగి తదితర గ్రామాల్లో కాయగూరల తోటలు సాగులో ఉన్నాయి. ప్రస్తుతం కూరగాయలకు మంచి ధర ఉండటంతో రైతులు మాగాణి భూముల్లో కూరగాయల సాగు చేయటానికి అధికసంఖ్యలో మొగ్గుచూపుతున్నారు. ఎండాకాలం చాలా ప్రాంతాల్లో కూరగాయల మొక్కలు ఎండిపోయి, కూరగాయల ధరలు విపరీతంగా పెరిగిపోతుండటంతో, కూరగాయలు పండించిన రైతులకు రేటు గిట్టుబాటు అవుతున్నాయి. దీంతో కూరగాయలు సాగుచేసిన రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

సికెల్‌సెల్ ఎనీమియాపై అప్రమత్తంగా ఉండాలి

● ఎమ్ఎల్‌హెచ్‌పీ కీర్తి



సికెల్‌సెల్ ఎనీమియాపై అవగాహన కల్పిస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ కీర్తి, పక్కన గ్రామ సర్పంచ్ రాజ్యలక్ష్మి, ఏఎన్ఎం ఝాన్సీ తదితరులు

తెనాలి రూరల్, జూన్ 19: నొప్పులతో మొదలై ప్రాణాంతకంగా మారే సికెల్‌సెల్ ఎనీమియా వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అంగలకుదురు ఎమ్ఎల్‌హెచ్‌పీ కొమ్మలపాటి కీర్తి పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని అంగలకుదరు సచివాలయంలో సికెల్‌సెల్ ఎనీమియా వ్యాధిపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ ఊసరపు రాజ్యలక్ష్మి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యురాలు కీర్తి మాట్లాడుతూ సికెల్‌సెల్ ఎనీమియా వ్యాధి శరీరంలో రక్త ప్రసరణకు కీలకంగా ఉన్న ఎర్ర రక్త కణాలను కొడవలి (సికెల్‌సెల్) ఆకారంలో మార్చి వాటిని నాశనంచేసి ప్రాణాలను హరించివేస్తుందని వివిధ పరిశోధనలలో వెల్లడైందన్నారు. దీనికి ప్రధానకారణమంటూ లేదని వంశ పారంపర్యంగా కూడా ఈ వ్యాధి బారిన పడే అవకాశం ఉందన్నారు. ఈ వ్యాధిసోకిన వారికి రక్తహీనత, శరీరం అంతటా తగినంత ఆక్సిజన్ తీసుకెళ్లేందుకు పనిచేసే ఆరోగ్యకరమైన ఎర్ర రక్తకణాలు లేకుండా చేస్తుందన్నారు. వ్యాధిసోకిన వారికి ఎముకల్లో నొప్పి ప్రారంభమవుతుందని, రక్తప్రసరణ సరిగ్గా జరగకపోవడంతో ఛాతి, చేతులు, కాళ్ల నొప్పులతో కూడిన వాపు వారాలు, నెలలు వరకూ ఉండవచ్చన్నారు. ఎవరికైనా ఈ లక్షణాలు ఉంటే దగ్గరలోని ఆశ కార్యకర్తలకు లేదా సచివాలయ వైద్య సిబ్బందికి, పీహెచ్‌సీ, జిల్లా ప్రభుత్వ వైద్యశాలలు వంటి వాటిలో వైద్యులను సంప్రదించి రక్తపరీక్షలు చేయించుకుని సకాలంలో మందులు వాడితే ప్రమాదస్థాయి తగ్గి పూర్తి ఆరోగ్యవంతులుగా జీవించవచ్చని కీర్తి వివరించారు. అనంతరం పలువురికి రక్తపరీక్షలు జరిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎం రావూరు ఝాన్సీ, ఆషాలు భవాని, రీబికా, రమణకుమారి, సుగుణ, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధిహామీ పనులను పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ ఏపీవో రవి

ఉపాధి హామీ పనుల పరిశీలన

కొల్లిపర, జూన్ 19 : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని డీఆర్‌డీఏ ఏపీవో ఎం. రవి అన్నారు. బుధవారం మండల పరిధిలోని మున్నంగి, కొల్లిపర, వల్లభాపురం, అన్నవరం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఆయన పరిశీలించారు. ఉపాధిహామీ పనులపై కూలీలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ పేదప్రజలందరూ ఉపాధిహామీ పనులను సద్వినియోగించు కోవాలన్నారు. ఉపాధిహామీ పనుల్లో పాల్గొనే కూలీలకు చేసిన పనుల బట్టి వేతనం ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లు వనుకూరు రాజేంద్ర, వల్లభాపురం బుజ్జి, కనపర్తి సాగర్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.



శాంతి హోమంలో పూజలను నిర్వహిస్తున్న ట్రస్టు సహాయ కార్యదర్శి రమణయ్య, సుబ్బారావు తదితరులు

వైభవంగా శాంతి హోమాలు

తెనాలి, మారీసుపేట జూన్ 19: స్థానిక గంగానమ్మపేటలోని శ్రీవిద్యా పీఠంలో శ్రీసాలిగ్రామ మఠం ట్రస్టు ఆధ్వర్యంలో ప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామి) స్వయం పర్యవేక్షణలో శ్రీనవగ్రహ సహిత శ్రీనక్షత్ర సంపూర్ణ శాంతి హోమంను భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహిస్తున్నారు. ఏడో రోజు బుధవారం విశాఖ నక్షత్రం వారిచే గణపతి పూజ, రుద్రాభిషేకాలు, గణపతి హోమం, నవగ్రహ హోమం, శ్రీమహామృత్యుంజయ హోమంను యల్లాప్రగడ పవన్‌కుమార్‌శర్మ ఋత్వికులతో యజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. భక్తులతో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా బాలస్వామి మాట్లాడుతూ విశాఖ నక్షత్రం యెక్క విశిష్టతను, శాంతి హోమం చేయుటవలన జరిగే ఫలితాలను తెలియజేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ నంబూరి వెంకట కృష్ణమూర్తి, ట్రస్ట్ వైస్ చైర్మన్ పెనుగొండ వెంకటేశ్వరావు, జాయింట్ సెక్రటరీ ముద్దభక్తుని రమణయ్య రావూరి సుబ్బారావు, గోపు రామకృష్ణ, కోన నాగేశ్వరావు, చుండూరు లోకనాథం, జయలక్ష్మి మాతృమండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



చివలూరులో చిన్నారులకు టీకాలు వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

పిల్లలకు తప్పనిసరిగా టీకాలను వేయించాలి

● మండల వైద్యాధికారి ప్రియాంక

కొల్లిపర, జూన్ 19: పిల్లలందరికీ తప్పనిసరిగా వ్యాధినిరోధక టీకాలను వేయించాలని మండల వైద్యాధికారి వేముల ప్రియాంక అన్నారు. బుధవారం మండల పరిధిలోని చివలూరులో ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. పిల్లలకు టీకాలువేసి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ప్రియాంక మాట్లాడుతూ చిన్న పిల్లలకు టీకాలు వేయడం వలన ప్రాణాంతమైన వ్యాధులనుంచి కాపాడుకోవచ్చునన్నారు. అప్పుడే పుట్టిన బిడ్డ దగ్గర నుంచి టీకాలు వేయించాలన్నారు. టీకాలు వేయించే విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలన్నారు. వైద్యాధికారుల సలహా మేరకు క్రమం తప్పకుండా వ్యాధినిరోధక టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి తుమ్మల నాగరాజు, పీహెచ్ఎన్ సుమతి, హెల్త్‌విజిటర్ కొండమ్మ, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, ఏఎన్ఎం ఆషాజ్యోతి, ఆషా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు ధర్మారావు మాదిగ తదితరులు

దళితులకు సముచిత స్థానం కల్పించిన చంద్రబాబు

● ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు ధర్మారావు మాదిగ

తెనాలి రూరల్, జూన్ 19: దళితుల పక్షపాతి సీఎం చంద్రబాబు నాయుడని తన క్యాబినెట్‌లో దళితులకు సముచిత స్థానం కల్పిస్తూ వంగలపూడి అనితకు హోంశాఖ మంత్రిగా నియమించడం అభినందనీయమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఉన్నం ధర్మారావు మాదిగ అన్నారు. బుధవారం మండలంలోని కొలకలూరులో అనితకు హోంశాఖ మంత్రిగా నియమించడంపై సీఎం చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేసి ఆయనకు, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ సీనియర్ నాయకులు ఉన్నం రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉన్నం చిన్నజాన్, మోదుకూరి దావీదు, ఉన్నం మధు, సన్నీ, భార్గవి, భాస్కరరావు, రాజశేఖర్, ఇస్సాకు, గొరకపూడి సాల్మాన్, వెంకయ్య, సుద్దపల్లి కోటేశ్వరరావు, విక్కి పాల్గొన్నారు.



బడి బాట ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ నిర్వాహకులు

బడి ఈడు చిన్నారులను పాఠశాలల్లో చేర్పించాలి

● ఐసీడీఎస్ సీడీపీవో వెంకటరమణ

పొన్నూరు టౌన్, జూన్ 19: బడి ఈడు చిన్నారులను తప్పనిసరిగా పాఠశాల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సీడీపీవో ఎస్.వెంకటరమణ అన్నారు. పట్టణంలోని 1, 2, 3 వార్డులో బుధవారం అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో బడిబాట నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులో ర్యాలీ నిర్వహించి చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. 3 నుంచి 5 సంవత్సరాల లోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని సూచించారు. ఆపై వయస్సు గల చిన్నారులను పాఠశాలలకు పంపాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రాథమిక విద్యను అందిస్తున్నట్లు వివరించారు. అలాగే ప్రభుత్వం అందచేస్తున్న పౌష్టికాహారం గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలందరూ చదువుకోవాలి: హెచ్‌ఎం

తెనాలి రూరల్, జూన్ 19: బడిఈడు ఉన్న పిల్లలందరూ చదువుకోవాలని వారి కోసం ప్రభుత్వం అనేక విధాలుగా కృషి చేస్తుందని గురుకుల స్కూల్ హెచ్‌ఎం విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం దళిత బహుజన రిసోర్సెంటర్ ఆధ్వర్యంలో పట్టణంలోని చంద్రబాబునాయుడు కాలనీలో గురుకుల బాలికల హాస్టల్‌కు ఇద్దరు కాగితాలు ఏరుకునే కుటుంబాల వారి పిల్లలను విజయకుమార్ సహకారంతో రెసిడెన్సియల్ స్కూల్‌లో జాయిన్ చేసుకున్నారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ బడిఈడు ఉన్న పిల్లలతో వెట్టిచాకిరీ చేయించడం చట్టరీత్యానేరమన్నారు. తల్లిదండ్రులకు పోషించే స్థోమత లేకున్నా ప్రభుత్వం వారికి అన్ని సౌకర్యాలు కల్పించి విద్యావంతులుగా తీర్చదిద్దనుందని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలని కోరారు. కార్యక్రమంలో డీబీఆర్‌సీ ట్రైనింగ్ కోఆర్డినేటర్ హేమలత, గుంటూరు డివిజన్ కో ఆర్డినేటర్ రవితేజ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థునులను పాఠశాలలో చేర్పిస్తున్న హేమలత, ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ అబ్దుల్ మతీన్

సురక్షిత తాగునీటి సరఫరాకు చర్యలు: డీఈఈ

చేబ్రోలు, జూన్ 19: ప్రజలకు సురక్షిత తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకుంటున్నట్లు గ్రామీణ నీటి సరఫరా శాఖ డీఈఈ అబ్దుల్ మతీన్ అన్నారు. బుధవారం చేబ్రోలు ఎంపీడీవో కార్యాలయంలో సమీక్ష సమావేశం జరిగింది. రక్షిత తాగునీటి సరఫరా, శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా డీఈఈ మట్లాడుతూ గ్రామాల్లో ప్రతివ్యక్తి 55లీటర్ల తాగునీటి సరఫరా జరిగేలా చూస్తున్నట్లు చెప్పారు. క్రమం తప్పకుండా క్లోరినేషన్ జరిగేలా గ్రామ పంచాయతీలు బాధ్యత వహించాలన్నారు. తాగునీరు కలుషితమైతే ప్రజలు వ్యాధులు బారినపడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. వాతావరణం మారుతున్న దృష్ట్యా వ్యాధులు ప్రబలేందుకు అవకాశం ఉన్న నేపథ్యంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఓవర్ హెడ్ ట్యాంక్‌లు శుభ్రపరచటం, మురుగు నీటి కాల్వల నిర్వహణ, క్లోరినేషన్, రసాయన పరీక్షలు తప్పనిసరిగా చేయించాలని సూచించారు. రక్షిత తాగునీటి సరఫరా వివరాలు ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. గ్రామ పంచాయతీలో క్లోరినేషన్ మీటర్ ఏర్పాటు, బోర్‌వెల్స్ వద్ద డిస్క్ మీటర్ల ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌బ్ల్యూఎస్ అధికారులు, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.



నరేంద్రకుమార్‌ను సత్కరిస్తున్న వీరవల్లి మురళి, నాగభూషణం తదితరులు

ప్రజల మనసు గెలిచిన నాయకుడు ధూళిపాళ్ల

● గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి

పొన్నూరు టౌన్, జూన్ 19: పాడి రైతులకు అండగా నిలబడి పొన్నూరు అభివృద్ధికి అహర్నిశలు పనిచేసి ప్రజలందరి మనస్సు గెలిచిన నాయకుడు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అని గణేష్ యూత్ కన్వీనర్, టీడీపీ సీనియర్ నాయకుడు వీరవల్లి మురళి అన్నారు. బుధవారం గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి, అంగలకుదరు గ్రామ ఉపసర్పంచ్ కనగాల నాగభూషణంలు నరేంద్రకుమార్ నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి దుశాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో పొన్నూరు నియోజకవర్గంలో తిరుగలేని నాయకుడిగా ఉన్న నరేంద్రకుమార్‌ను దెబ్బతీసేందుకు సీఐడీ కేసులు సైతం ఆయపై పెట్టి ఇటు కేడర్‌ను, అటు కుటుంబ సభ్యులను సైతం మానసిక క్షోభకు గురిచేశారని ఆరోపించారు. ప్రజా నాయకుడిగా నరేంద్రకుమార్‌కు ఉన్న పేరును చెడగొట్టి అవినీతిపరుడన్న మచ్చవేయాలన్న వైసీపీ కుట్రపూరిత రాజకీయాలను ప్రజలు గమనించి ఆ ప్రభుత్వానికి ఓటుతో బుద్ధి చెప్పారన్నారు. రైతుల పక్షపాతిగా ఆయన తండ్రి ధూళిపాళ్ల వీరయ్య చౌదరి చేసిన సేవలను వారసత్వంగా అందిపుచ్చుకున్న నరేంద్రకుమార్ తండ్రి ఆశయాలను ముందుకు నడుపుతూ ప్రజల్లో చెరగని ముద్రవేసుకున్నారని చెప్పారు. సీఎం చంద్రబాబు నాయుడు ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌కు తన కేబినేట్‌లో సముచిత స్థానం కల్పిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ సాంబశివరావు తదితరులు

విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాంలు పంపిణీ

పొన్నూరు టౌన్, జూన్ 19: ప్రభుత్వ పాఠశాల్లో కార్పొరేట్ స్థాయి విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ ఆకుల సాంబశివరావు అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగ్‌లు, యూనిఫాంను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలను ప్రైవేటు పాఠశాలకు దీటుగా రూపొందించటమే కాకుండా నాణ్యమైన విద్యను అందించనున్నట్లు చెప్పారు. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న సౌకర్యాలను గుర్తించి తమ చిన్నారులను ప్రభుత్వ పాఠశాల్లో చేర్పించాలని సూచించారు. ఉత్తమ ఫలితాలు అందించేలా ఉపాధ్యాయలు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాదాల వెంకటేశ్వరరావు, లక్ష్మీ నారాయణ చౌదరి, పఠాన్ అహ్మద్‌ఖాన్, బండ్లమూడి బాబురావు, లింగమల్లు మోహన్ కృష్ణ, జనసేన పట్టణ అధ్యక్షుడు షేక్ కరిముల్లా, దేశంశెట్టి సూర్య తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

● రైతు సంఘం నాయకుడు ములకా శివసాంబిరెడ్డి



రైతులతో మాట్లాడుతున్న ములకా శివసాంబిరెడ్డి

తెనాలి రూరల్, జూన్ 19: కౌలు రైతులను ప్రభుత్వం ప్రత్యేక రుణ ప్రణాళికను ఏర్పాటుచేసి ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివ సాంబిరెడ్డి విజ్ఞప్తి చేశారు. బుధవారం పట్టణంలోని ఐతానగర్ ఎర్రబడి సెంటర్ వద్ద కౌలు రైతులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ మునుపటి కంటె ఈ ఏడాది పంటలు పండించే పొలం కౌలు ధరలు అమాంతం పెరిగాయని, వ్యవసాయంపైనే ఆదారపడిన కౌలు రైతులు కూడా నానాటికీ పెరుగుతున్నారన్నారు. కేంద్రప్రభుత్వం ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్నా ఇంత వరకూ కౌలు రైతులను గుర్తించకపోవడం అన్యాయమన్నారు. డెల్టాప్రాంతంలో నూటికి 70 నుంచి 80శాతం ఉన్న కౌలు రైతులను సకాలంలో గుర్తించి కార్డులు అందించకపోవడంతో పెట్టుబడికి అవసరమైన రుణాలను బ్యాంకులు అందించడంలేదని, పైగా ప్రభుత్వం ద్వారా రైతులకు వచ్చే సబ్సిడీలు, నష్టపరిహారాలు కూడా రావడంలేదని ఆరోపించారు. గత ప్రభుత్వంలో సీసీఆర్‌సీ కార్డులు వచ్చినా రుణాల కోసం బ్యాంకర్లను రైతులు సంప్రదించినప్పటికీ వారుపెట్టే ఆంక్షలతో వాటిని పొందలేక వడ్డీ వ్యాపారుల వద్ద నూటికి రూ.2 నుంచి 5వరకూ వడ్డీలకు రుణాలు తీసుకుని సాగుచేసే పరిస్థితి నెలకొందని వాపోయారు. భూ యజమానితో సంబంధం లేకుండా కార్డులుతోపాటు, సకాలంలో బ్యాంకర్ల ద్వారా రుణాలు ఇప్పించేలా ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని కోరారు. రైతు సుమంత్, మేకల భాస్కరరావులు మాట్లాడుతూ మాట్లాడుతూ గత సంవత్సరం ఎకరాకు రూ.20వేలు కౌలు ఉంటే ఈ సంవత్సరం రూ.28 నుంచి 29వేలు, ధాన్యం కౌలు అయితే 20 నుంచి 22 బస్తాలకు పెరిగిందన్నారు. ఈ విధంగా కౌలు ధరలు పెరిగితే రైతుకు మిగిలేదేమి ఉండదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం సబ్సిడీతో వరి విత్తనం బీపీటీ-5204, ఎమ్‌టీయూ-1224, 1262లు, పవర్ స్ప్రేయర్లు ఇతర యాంత్రీకరణలను అందించి రైతులను ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మేకల చిట్టిబాబు, తెనాలి శ్యాం, వేజెండ్ల నాగేశ్వరరావు, కె.బాబురావు తదితరులు పాల్గొన్నారు.